# హన్‌మాన్ జయంతి వేడుకల్లో పాల్గొన్న హోంమంత్రి మహమూద్ అలీ,పద్మారావు గౌడ్

**అడ్డగుట్ట,ఏ ప్రిల్ 6 ప్రభాతవార్త:**
హన్‌మాన్ జయంతిని పురస్కరించుకొని గురువారం తుకారాంగేట్ రియోపాయింట్ వద్ద భజరంగ్ యువసేన నాయకులు పల్లప్ మహేశ్, వల్లెపు యాదగిరిల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన హన్‌మాన్ జయంతి వేడుకలకు రాష్ట్ర హోంమంత్రి మహమూద్ అలీ, డిప్యూటీ స్పీకర్ పద్మారావు గౌడ్, అడ్డగుట్ట డివిజన్ కార్పోరేటర్ లింగాని ప్రసన్న, బిఆర్ఎస్ యువనేత రామేశ్వర్ గౌడ్, గ్రంథాలయ డైరెక్టర్ లింగాని శ్రీనివాస్‌లు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భజరంగ్ యువసేన నాయకులు పి.సాయి, బిఆర్ఎస్ నాయకులు మధుగౌడ్, శ్రీరామ్ నాయక్, మోహన్, మల్లేశ్ తదితరులు పాల్గొన్నారు.


అడ్డగుట్ట రియోపాయింట్ వద్ద హన్‌మాన్ జయంతి వేడుకల్లో పూజలు చేస్తున్న హోంమంత్రి మహమూద్ అలీ,డిప్యూటీ స్పీకర్ పద్మారావు గౌడ్,కార్పోరేటర్ లింగాని ప్రసన్న తదితరులు



# హైదరాబాద్ వార్త

## కోలాహలంగా అంజనీపుత్రుని

# శోభాయాత్ర

**-మారుమోగిన జై హనుమాన్ నినాదాలు -భారీ సంఖ్యలో తరలివచ్చిన భక్తులు**
**- వర్షంలోనూ కొనసాగిన పవనసుతుని వేడుకలు**





**హైదరాబాద్, ఏప్రిల్ 6 ప్రభాతవార్త**
హనుమాన్ జయంతి వేడుకలు నగరంలో ఘనంగా నిర్వహించారు. వీరహనుమాన్ శోభాయాత్ర వైభవంగా జరిగింది. గురువారం పవనసుతుని జన్మదినాన్ని పురస్కరించుకుని ఎంతో వైభవంగా నిర్వహించిన శోభాయాత్ర వేడుకలు అంబరాన్నంటాయి. నగరంలో సాయంత్రం కురిసిన భారీ వర్షం కారణంగా పలు ప్రాంతాల్లో హనుమాన్ శోభాయాత్రకు కొద్దిసేపు ఆటంకమేర్పడింది. హనుమంతుని ప్రధాన ఆలయాలు భక్తులతో కిక్కిరిసిపోయాయి. వివిధ ప్రాంతాల్లోని ఆంజనేయ ఆలయాల నుంచి పెద్ద ఎత్తున ప్రదర్శనలు చేపట్టారు. నగర రహదారులన్ని హనుమాన్ నామస్మరణతో, కాషాయ వర్ణంతో ఆధ్యాత్మిక శోభ సంతరించుకుంది. గౌలిగూడలోని రామమదిరంలో హర్యానా గవర్నర్ దత్తాత్రేయ ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం గౌలిగూడ నుంచి తాడ్‌బండ్ వరకు ప్రతిష్టాత్మకంగా శోభాయాత్ర ప్రారంభించారు. వేలాది సంఖ్యలో పాల్గొన్న భక్తులు, కార్యకర్తలలో శోభాయాత్ర ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. మరో వైపు కర్మన్‌ఘాట్ హనుమాన్ ఆలయం నుంచి శోభయాత్ర ఘనంగా ప్రారంభమైంది. కర్మన్‌ఘాట్ హనుమాన్ దేవాలయం నుంచి తాడ్‌బండ్ వరకు 21 కిలోమీటర్ల మేర ఈ శోభయాత్ర కొనసాగింది. చంపాపేట, ఐఎస్‌సదన్, సైదాబాద్, సరూర్‌నగర్ మీదుగా హనుమాన్ శోభయాత్ర కొనసాగింది. భాగ్యనగర్ ప్రజాహిత సమితి ఆధ్వర్యంలో వేలాది మంది భక్తులు, కార్యకర్తలు శోభాయాత్రలో పాల్గొన్నారు. జై హనుమాన్, జై శ్రీరామ్ నినాదాలతో రహదారులు మారుమోగిపోయాయి. వీహెచ్‌పీ, బజరంగ్‌దళ్ నేతృత్వంలో గురువారం ఉదయం ప్రారంభమైన యాత్ర రాత్రి ముగిసింది.

హనుమాన్ జన్మదినోత్సవం సందర్భంగా తాడ్‌బండ్ వీరాంజనేయ స్వామి ఆలయాన్ని సర్వాంగ సుందరంగా ముస్తాబు చేశారు. ఆలయంలో అంజనీపుత్రుని జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచే పెద్ద ఎత్తున భక్తులు స్వామివారి ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. భజన కార్యక్రమాలతో ఆలయ ప్రాంగణమంతా అధ్యాత్మిక శోభను సంతరించుకుంది. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా నిర్వాహకులు తగిన ఏర్పాట్లు చేశారు.మరోవైపు ఈ శోభయాత్రను ప్రశాంతంగా నిర్వహించేందుకు పోలీసు యంత్రాంగం భారీ ఏర్పాట్లు చేసింది. 10వేల మంది పోలీసులు బందోబస్తు విధులు నిర్వహిస్తున్నారు.850 సిసిటీవి కెమెరాలు. మౌంటెడ్ కెమెరాలు, మఫ్టీ పోలీసులతో పటిష్టమైన నిఘా విని యోగించారు.

# దంచికొట్టిన వాన

**-పలు చోట్ల వడగళ్లు**
**-రోడ్లన్నీ జలమయం..భారీగా ట్రాఫిక్ జామ్**
**-మరో రెండు రోజులు భారీ వర్షాలు**



**హైదరాబాద్, ఏప్రిల్ 6 ప్రభాతవార్త**
నగరంలో వర్షం దంచి కొట్టింది. ఉపరితల ద్రోణి ప్రభావంతో పలు ప్రాంతాల్లో భారీ వర్షంతోపాటు వడగళ్ల వాన కురిసింది. కోఠి, కింగ్ కోఠి, సుల్తాన్‌బజార్, బేగంబజార్, అబిడ్స్, నాంపల్లి, బషీర్‌బాగ్, నారాయణగూడ, హిమాయత్‌నగర్, లిబర్టీ, కాచిగూడ, గోల్నాక, నల్లకుంట, అంబర్‌పేట, రామంతాపూర్, ఉప్పల్, నాగోల్, ఎల్బీనగర్, మలక్‌పేట, దిల్‌సుఖ్‌నగర్,రాంనగర్, విద్యానగర్, గాంధీనగర్, అడిక్‌మెట్, దోమలగూడ, కవాడిగూడ, హబ్సిగూడ, నాచారం, మల్లాపూర్, తార్నాక,బోడుప్పల్, ఉప్పల్, చార్మినార్ తదితర ప్రాంతాల్లో భారీ వర్షం కురిసింది. దీంతో పాదచారులు వాహనదారులు కొద్ది సేపు ప్రత్యామ్నాయ మార్గాల్లో తలదాచుకున్నారు. సికింద్రాబాద్, తార్నాక, అంబర్‌పేట, నల్లకుంట, లిబర్టీ, బషీర్‌బాగ్ ప్రాంతాల్లో వడగళ్ల వర్షం కురిసింది. దీంతో పలు కార్ల అద్దాలు ధ్వంసం అయ్యాయి. భారీ వర్షానికి వివిధ ప్రాంతాల్లోని హోర్డింగ్స్ కూలిపోయాయి. చెట్ల కొమ్మలు విరిగిపోయాయి. భారీ వర్షానికి రోడ్లన్నీ జలమయం అయ్యాయి. వాహన రాకపోకలు నిలిచిపోయి భారీగా ట్రాఫిక్ జామ్ అయిందిగురువారం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు దంచికొట్టిన ఎండతో తీవ్ర ఉక్కపోత వాతావరణం ఏర్పడగా, మధ్యాహ్నం రెండు గంటల తర్వాత ఆకాశం మేఘావృతం కావడంతో వాతావరణం ఒక్కసారిగా చల్లబడింది. భారీ వర్షం కారణంగా నగరంలో పలు ప్రాంతాల్లో హనుమాన్ శోభాయాత్రకు కొద్దిసేపు ఆటంకమేర్పడింది.ద్రోణి ప్రభావంతో రాగల రెండు రోజులు ఉరుములు, మెరుపులతో పాటు గంటకు 40 నుంచి 50 కిలోమీటర్ల వేగంతో ఈదురు గాలులతో కూడిన వడగళ్ల వాన అక్కడక్కడ కురిసే అవకాశముందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడించింది.



## గద్దర్ దళం ఆవిర్భావం

**-సాంస్కృతిక సంస్థ ద్వారా కళాకారులకు బాసట**
**-ప్రజా చైతన్యం కోసం రాష్ట్ర వ్యాప్త పర్యటనలు: ప్రజా గాయకుడు గద్దర్**


సమావేశంలో గద్దర్

**అల్వాల్, ఏప్రిల్ 6 ప్రభాతవార్త:**
గళాన్ని మరింత లోతుగా రాష్ట్ర ప్రజలకు వినిపించడానికి మూడు నెలలు పాటు పర్యటన చేయనున్నట్లు ప్రజాగాయకుడు గద్దర్ స్పష్టం చేశారు. గద్దర్‌పై కాల్పులు జరిపి 26 సంవత్సరాలు నేటికి గురువారంతో పూర్తి అయిన నేపథ్యంలో అల్వాల్‌లో జరిగిన సమావేశంలో ఆ రోజు మరుపురాని మాయని గాయమని పలువురు వక్తలు అభిప్రాయ పడ్డారు. ఈ సందర్భంగా గద్దర్ దళం ఏర్పాటు కన్వీనర్‌గా విమలా గద్దర్‌ను నియమించడం జరిగింది. అనంతరం గద్దర్ మాట్లాడుతూ ప్రతిపక్షాలకు మద్దతుగా సాంస్కృతిక కార్యక్రమాలుతో ప్రజలుతో మమేకం అవుతానని వివరించారు. భవిష్యత్తులో కొన్ని కఠిన నిర్ణయాలు తీసుకోనున్నానని చెప్పారు. రాష్ట్రంలో తన పర్యటనలకు సంబంధించి వెనుకంజ వేసే ప్రసక్తి లేదన్నారు. ప్రజలను చైతన్యం చేయడంతో పాటుగా కవులు కళాకారులు రచయితలు డప్పు కళాకారులకు అండగా ఉంటానని తెలిపారు. ప్రత్యేక రాష్ట్రం అవిర్భావం అనంతరం పరిస్థితులపై తన గళాన్ని వినిపిస్తానని అన్నారు. ఉమ్మడి రాష్ట్రం ప్రత్యేక రాష్ట్రంలోని వ్యత్యాసాన్ని చూపు తానని తెలిపారు. కలలు కన్న తెలంగాణా నేటి తెలంగాణాలో ఉన్న స్థితిగతు లు ఆవిష్కరిస్తానని పేర్కొన్నారు. సీనియర్ పాత్రికేయుడు పాశం యాదగిరి మాస్టర్ జి జెవి రాజు హరినాథ్ తదితర వ్యక్తలు ప్రసంగించడం జరిగింది. సమావేశం సందర్భంగా ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

### పండుగలు సనాతన ధర్మానికి ప్రతీకలు : గవర్నర్ బండారు దత్తాత్రేయ


పూజలు చేస్తున్న హర్యానా గవర్నర్ బండారు దత్తాత్రేయ

**చిక్కడపల్లి, ఏప్రిల్ 6 ప్రభాతవార్త:**
పండుగలు, ఉత్సవాలు సనాతన ధర్మానికి ప్రతీకలుగా నిలుస్తాయని హర్యానా గవర్నర్ బండారు దత్తాత్రేయ అన్నారు. గురువారం అడిక్‌మెట్‌లోని అభయాంజనేయస్వామి దేవాలయంలో శ్రీనివాస్‌నాయుడు ఆధ్వర్యంలో హనుమజ్జయంతి సందర్భంగా జరిగిన పూజా కార్యక్రమంలో బండారు దత్తాత్రేయ పాల్గొని పూజలు నిర్వహించారు.కార్యక్రమంలో ఆలయం ప్రతినిధులు పాల్గొన్నారు.

### అంబర్‌పేట్ దేవస్థాన సేవా సమితి నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకారం

**హైదరాబాద్, ఏప్రిల్ 6,ప్రభాతవార్త:**
అంబర్‌పేట్ దేవస్థాన సేవా సమితి ఎన్నికల్లో త్రిశూలం గుర్తుపై పోటీచేసి గెలుపొందిన వై.శంకర్‌గౌడ్ ఫ్యానల్ గురువారం ప్రమాణస్వీకారం చేసింది. అధ్యక్షులుగా వై.శంకర్‌గౌడ్, ఉపాధ్యక్షులుగా రంగంపల్లి రాజు, ప్రధాన కార్యదర్శిగా బింది మల్లికార్జున్‌గౌడ్, జాయింటన సెక్రటరీగా సెంగలి సుధాకర్, ఆర్గనైజింగ్ సెక్రటరీగా దోమకొండ కిశోర్, కోశాధికారిగా గడ్డం శ్రీధర్‌లు దేవస్థాన ప్రాంగణంలో పదవీబాధ్యతలు స్వీరించారు. ఈకార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ పంజాల జ్ఞానేశ్వర్‌గౌడ్, కుచ్చకంటి దుర్గాప్రసాద్‌రెడ్డి, గడ్డం లక్ష్మణ్‌గౌడ్, పి.గిరిధర్‌గౌడ్, బింది రాజుగౌడ్, మలక్‌పేట్ సతీష్‌గౌడ్,దాడిగె జగన్, గోపాల్‌గౌడ్, మహేందర్‌గౌడ్, పండిత్ ముదిరాజ్, చంద్రశేఖర్,గడ్డం కృష్ణ పాల్గొన్నారు.

# ప్రపంచస్థాయిలో సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ అభివృద్ధి

**-అన్ని హంగులతో అధునాతన సౌకర్యాలు**
**- 8న ప్రధాన మంత్రి నరేంద్రమోదీ చేతుల మీదుగా అభివృద్ధి పనులకు శంకుస్థాపన**

**తార్నాక, ఏప్రిల్ 6 ప్రభాతవార్త:**
సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌ను ప్రపంచస్థాయిలో తీర్చిదిద్దనున్నారు. కేంద్రప్రభుత్వం ఆద్వర్యంలో పునరాభివృద్ధి పథకంలో భాగంగా రూ. 715 కోట్ల వ్యయంతో స్టేషన్‌ను ఎయిర్‌పోర్టు తరహాలో అభివృద్ధి చేయనున్నారు. ఇంజనీరింగ్ ప్రొక్యూర్‌మెంట్ కన్‌స్ట్రక్షన్ మోడల్‌లో పునరాభివృద్ధి చేసేందుకు ఇప్పటికే ప్రణాళికలను సిద్ధం చేశారు. ఈ అభివృద్ధి పనులు 2025 అక్టోబర్‌లోగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి రానుంది. ఈ నెల 8న ప్రధాన మంత్రి నరేంద్రమోది స్టేషన్ అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేయనున్న తరుణంలో రైల్వే అధికారులు అన్ని ఏర్పాట్లను చేస్తున్నారు. విదేశీ స్టేషన్ల మాదిరిగా కళ్లు చెదిరే సౌకర్యాలను ఇక్కడ ఏర్పాటు చేస్తున్నారు. సౌత్ సెంట్రల్ రైల్వేకు కేంద్ర బిందువుగా ఉన్న సికింద్రాబాద్ స్టేషన్ నుంచి 121 రైళ్ల రాకపోకలు సాగిస్తుండగా రోజుకు 1.40 లక్షల మంది ప్రయాణిస్తుంటారు.

**ప్రధాని మోది రాకకు సికింద్రాబాద్ స్టేషన్ ముస్తాబు**

**అభివృద్ధి పనుల ప్రారంభోత్సవాలకు ఏర్పాట్లు పూర్తి**
ఈ నెల 8న ప్రదాని నరేంద్రమోది రాకను పురస్కరించుకొని సికింద్రాబాద్ రైల్వేస్టేషన్‌ను అధికారులు ముస్తాబు చేస్తున్నారు. సికింద్రాబాద్ నుంచి తిరుపతికి వందేభారత్ రైలును ప్రారంభించడతో పాటు సికింద్రాబాద్ జంట నగరాల సబర్బన్ విభాగాల్లో నూతనంగా ఎంఎంటీఎస్ రెండో దశ సర్వీసుల ప్రారంభం, అదేవిదంగా సికింద్రాబాద్ ముహబూబ్‌నగర్ ప్రాజెక్ట డబ్లింగ్, విద్యుదీకరణ పనులకు, సికింద్రాబాద్ స్టేషన్ అభివృద్ధి పనుల శంకుస్థాపన చేయనున్నారు. ఇందుకోసం ఇప్పటికే బోయిగూడ వైపు ఉన్న నెం.9,10 ఫ్లాట్ ఫాంలను శుభ్రం చేస్తున్నారు.

**స్టేషన్‌ల్లో ఏర్పాటు చేయనున్న అధునాతన సౌకర్యాలు....**
1. స్టేషన్ ఉత్తరం వైపు 22,156 చదరపు మీటర్ల విస్తీర్ణంలో 3 అంతస్థుల కొత్త స్టేషన్
2. దక్షిణం వైపు భవనాన్ని జీప్లస్ 3 అంతస్థుల మేరకు అభివృద్ధి.
3. ప్రయాణికుల సౌకర్యం కోసం 108 మీటర్ల వెడల్పుతో స్కై కాన్కోర్స్, రూఫ్ టాప్ ప్లాజా నిర్మాణం.
4. ఒక్కో ప్లాట్‌ఫాంపై 2 ఎస్కలేటర్లు ఏర్పాటు, క్యాంటిన్ల ఏర్పాటు.
5. దివ్యాంగుల సౌకర్యం కోసం వీల్ చైర్ల ఏర్పాటు.
6.ఆటోలు, కార్లు, బైకులు నేరుగా స్టేషన్ వద్దకు వచ్చి తిరిగి బయటకు వెళ్లేందుకు రూఫ్ ఏర్పాటు,
7.జీఆర్‌పీ, ఆర్పీఎఫ్ పోలీస్టేషన్లకు కొత్త భవనాల ఏర్పాటు.

## కెసిఆర్ పథకాలు దేశంలోనే ఆదర్శం : మహమూద్ అలీ

**అడ్డగుట్ట,ఏ ప్రిల్ 6 ప్రభాతవార్త:**
తెలంగాణ రాష్ట్రంలో ముఖ్య మంత్రి కేసిఆర్ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు దేశంలోఎక్కడా లేని విధంగా అమలౌతున్నాయని, రాష్ట్ర హోం మంత్రి మహమూద్ అలీ తెలిపారు. గురువారం సికింద్రాబాద్ అసెంబ్లీ అడ్డగుట్ట డివిజన్‌లోని ఆజాద్ చంద్రశేఖర్ నగర్‌లో దాదాపు 4 కోట్ల వ్యయంతో 48 మంది లబ్దిదారులకు నిర్మించిన డబుల్‌బెడ్‌రూమ్‌ఇండ్ల అసెంబ్లీ డిప్యూటీ స్పీకర్ టి.పద్మారావు గౌడ్, అడ్డగుట్ట డివిజన్ కార్పోరేటర్ లింగాన ప్రసన్న శ్రీనివాస్, డిప్యూటీ మేయర్ మోతె శ్రీలతా శోభన్ రెడ్డిలతో కలిసి ప్రారంభించి లబ్ధిదారులకు కీస్‌ను అందజేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడుతూ పేద ప్రజల కళలను సహకారం చేస్తున్న ఘనత బిఆర్ఎస్ ప్రభుత్వానికి దక్కిందన్నారు. పేద ప్రజల ససంక్షేమం, వారి అభివృద్ధి కోసం పద్మారావు గౌడ్ కృషి ప్రశంసనీయమన్నారు. డిప్యూటీ స్పీకర్ పద్మారావు గౌడ్ మాట్లాడుతూ సికింద్రాబాద్ అసెంబ్లీ పరిధిలో ప్రభుత్వ స్థలాల కొరత కారణంగా అర్హులైన లబ్దిదారులకు డబుల్‌బెడ్‌రూమ్ ఇండ్లను పూర్తి స్థాయిలో అందించలేక పోతున్నామన్నారు. సంవత్సరాల తరబడి స్థానికంగా నివాసం ఉంటున్న డబుల్‌బెడ్‌రూమ్ ఇండ్లు అందని లబ్ధిదారులకు బాటసింగారం, నాగోల్, జవహార్ నగర్ ప్రాంతాల్లో ఇండ్లను అందించేందుకు కృషి చేస్తామన్నారు. అడ్డగుట్టలో ప్రభుత్వ ఆసుపత్రిని నిర్మిస్తామన్నారు. ఏసిఎస్ నగర్‌లో ప్రజా సమస్యలు పరిష్కరించి ఆదర్శ కాలనీగా మార్చేందుకు కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో కార్పోరేటర్లు సామల హేమ, రాససూరి సునీత, గ్రంథాలయ డైరెక్టర్ లింగాని శ్రీనివాస్, బిఆర్ఎస్ యువనేత రామేశ్వర్ గౌడ్, హౌజింగ్ సిఈ సురేశ్, జోనల్ కమిషనర్ శ్రీనివాస్ రెడ్డి, సికింద్రాబాద్ ఆర్‌డిఓ వసంత కుమారి, ఇఇ.వెంకట్‌దాస్ రెడ్డి, జలమండలి జిఎం రమణా రెడ్డి, ఏసిఎస్ నగర్ డెవలప్‌మెంట్ కమిటీ నాయకులు పెండెం మనోహర్, అడ్డగుట్ట బిఆర్ఎస్ నేత నక్క మధు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆజాద్ చంద్రశేఖర్ నగర్ బస్తీ వాసులు పద్మారావు గౌడ్ జన్మదినం సందర్భంగా తమకు డబుల్‌బెడ్‌రూమ్ ఇండ్లు అందజేయడం అభినందనీయమన్నారు.


అడ్డగుట్ట ఏసిఎస్ నగర్‌లో నిర్మించిన డబుల్‌బెడ్‌రూమ్ ఇండ్లను లబ్ధిదారులకు అందజేస్తున్న హోంమంత్రి మహమూద్ అలీ, డిప్యూటీ స్పీకర్ పద్మారావు గౌడ్, డిప్యూటీ మేయర్ మోతె శ్రీలత శోభన్ రెడ్డి,కార్పోరేటర్ లింగాని ప్రసన్న తదితరులు

## వచ్చే అసెంబ్లీ ఎన్నికలలో బిజెపి అధికారంలోకి రావడం తథ్యం : లక్ష్మీనారాయణ


నార్సింగి మున్సిపల్ పరిధిలో జరిగిన బీజేపీ ఆవిర్భావ దినోత్సవంలో పాల్గొన్న జిల్లా ఓబీసీ మోర్చా అధ్యక్షులు దుద్దాల లక్ష్మీనారాయణ తదితరులు.

**నార్సింగి, ఏప్రిల్ 6 ప్రభాతవార్త :**
వచ్చే అసెంబ్లీ ఎన్నికలలో బీజేపీ అధికారంలోకి రావడం తథ్యమని రంగారెడ్డి జిల్లా ఓబీసీ మోర్చా అధ్యక్షులు దుద్దాల లక్ష్మీనారాయణ పేర్కొన్నారు. గురువారం నార్సింగి మున్సిపల్ అధ్యక్షులు చిక్కిరి బిక్షపతి యాదవ్ ఆధ్వర్యంలో జరిగిన బీజేపీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలకు లక్ష్మీనారాయణ ముఖ్య అతిథిగా విచేసి, బీజేపీ జెండాలు ఆవిష్కరించారు. అలాగే మణికొండ మున్సిపాలిటీలో అధ్యక్షులు బీరప్ప బీజేపీ జెండాను ఏగురవేసి ఆవిర్భావ వేడుకలు నిర్వహించారు. అనంతరం లక్ష్మీనారాయణ, బిక్షపతి యాదవ్, బీరప్పలు మాట్లాడుతూ ప్రజలకిచ్చిన హామీలను నెరవేర్చడంలో రాష్ట్ర ప్రభుత్వం ఘోరంగా విఫలమవుతుండడంతో తెలంగాణ రాష్ట్ర ప్రజానికం నిజాయతీకి మారుపేరుగా మారిన బీజేపీ వైపు చూస్తున్నారని తెలిపారు. ప్రధాన మంత్రి నరేంద్రమోడీ నాయకత్వంలో భారతదేశం పూర్వ వైభవ స్థితికి చేరుకుంటుందన్న నమ్మకం రోజు రోజుకు దేశ ప్రజలలో పెరుగుతుందన్నారు. తొమ్మిదేళ్ల పాలనలో ఒక్క స్కాం కూడా చేయకుండా, దేశంలోని అనేక క్లిష్టమైన సమస్యలను సున్నితంగా పరిష్కరిస్తూ, అంతర్జాతీయ స్థాయిలో భారతదేశ కీర్తి, ప్రతిష్టలను పెంచుతున్నారని తెలిపారు. మోడీ చర్యలతో చీటికి మాటికి చికాకు తెప్పిస్తూ పక్కలో బల్లెంగా మారిన పాకిస్థాన్ మనవైపు కన్నెత్తి చూసేందుకు కూడా వణికిపోతుందని, సరిహద్దుల నుంచి చైనా తోక ముడిచి వెనక్కి వెళ్లిపోయిందన్నారు. ప్రపంచాన్ని గడగడలాడించిన కరోనాకు టీకాను తయారు చేయించి, మనదేశంతో పాటు అనేక దేశాలకు ఎగుమతి చేసి ప్రపంచ ప్రజలందరికి పెద్ద దిక్కుగా మారిందన్నారు. ఈ ఘనతలన్నింటి వెనుక ప్రధాని మోడీ చతురత ఉందన్నారు. ప్రతీ బీజేపీ నాయకుడు, కార్యకర్త ప్రజలకు క్షేత్రస్థాయిలో అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారం కోసం ఉద్యమించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నేతలు దాసరి హనుమంతు, శంకరి కుమార్, రాజేందర్, మెండె నాగేష్ యాదవ్, బుచ్చిరెడ్డి, దొరల కృష్ణ, కౌన్సిలర్ ఆదిత్యారెడ్డి, గోవిందిగారి శివరాజ్, గణేషన, శేఖర్, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

## పరీక్షా కేంద్రానికి రాచకొండ సిపి చౌహాన్

**-ఫోన్‌తో లోనికి అనుమతి లేదన్న మహిళా కానిస్టేబుల్**
**-ఫోన్‌ను కానిస్టేబుల్‌కు ఇచ్చి లోనికి వెళ్లిన సిపి**
**- మహిళా కానిస్టేబుల్ కల్పనను అభినందించిన సిపి**


మహిళా కానిస్టేబుల్ కల్పనకు నగదు రివార్డును అందజేస్తున్న సిపి చౌహాన్

**సైదాబాద్, మార్చి 6 ప్రభాతవార్త:**
ఎల్బినగర్‌లో పదవ తరగతి పరీక్షా కేంద్రాన్ని పరిశీలించడానికి వచ్చిన రాచకొండ సిపి డి.ఎస్.చౌహాన్‌ను మహిళా కానిస్టేబుల్ అడ్డుకుని ఫోన్‌తో లోనికి వెళ్లడానికి అనుమతి లేదని చెప్పడంతో సిపి తన ఫోన్‌ను అక్కడ ఉన్న కానిస్టేబుల్‌కు అప్పగించి లోనికి వెళ్లారు. పరీక్షా కేంద్రం తనిఖీ అనంతరం తిరిగి బయటకు వచ్చి తన ఫోన్‌ను తీసుకుని సదరు మహిళా కానిస్టేబుల్‌ను సిపి అభినందించి నగదును రివార్డుగా అందజేశారు. ఎల్బినగర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల పదవ తరగతి పరీక్షా కేంద్రాన్ని గురువారం రాచకొండ సిపి డి.ఎస్.చౌహాన్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విధ్యార్థుల భవిష్యత్తు ముఖ్యమని, పరీక్షా కేంద్రాలలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా గట్టి బందోబస్తు ఏర్పాటు చేస్తున్నామని అన్నారు. పరీక్షా కేంద్రాల వద్ద విధి నిర్వాహణలో ఉన్న సిబ్బంది లోనికి వెళ్లే ప్రతి ఒక్కరిని క్షుణ్ణంగా తనిఖీ చేయాలని సూచించారు. పరీక్షా కేంద్రాలలోకి ఫోన్‌లకు అనుమతి లేదన్నారు. తాను పరీక్షా కేంద్రం తనిఖీకి వచ్చిన సమయంలో ఫోన్‌తో లోనికి తీసుకువెళ్లడానికి అనుమతి లేదని గేటు వద్ద విధి నిర్వాహణలో ఉన్న మహిళా కానిస్టేబుల్ కల్పన చెప్పడంతో తన ఫోన్‌ను కానిస్టేబుల్‌కు ఇచ్చి లోనికి వెళ్లడం జరిగిందన్నారు. నియమ నిబంధనలను గుర్తు చేసి డ్యూటీ సక్రమంగా నిర్వర్తిస్తున్న మహిళా కానిస్టేబుల్ కల్పనను అభినందించి రివార్డుగా రూ.500లు అందజేయడం జరిగిందన్నారు. సిపి వెంట ఎల్బినగర్ డిసిపి సాయిశ్రీ, ఎసిపి శ్రీధర్‌రెడ్డితో పాటు ఇతర అధికారులు ఉన్నారు.

### హనుమాన్ శోభయాత్ర సందర్భంగా అన్నదానం

**చిక్కడపల్లి, ఏప్రిల్ 6 ప్రభాతవార్త:** హనుమాన్ జయంతి సందర్భంగా యోచన స్వచ్ఛంద సంస్థ అధినేత జానకీ సుధాకర్ ఆధ్వర్యంలో పెద్దఎత్తున గురువారం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. అంతకుముందు ఆర్టీసి క్రాస్‌రోడ్స్‌లో హనుమాన్ శోభాయాత్ర సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ముఖ్యఅతిథులుగా మాజీ ఎంపి, టిపిసిసి వర్కింగ్ ప్రెసిడెంట్ ఎం.అంజన్‌కుమార్‌యాదవ్, ప్రముఖ వైద్యులు డాక్టర్ వెంకటరమణారావు హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో శ్యామ్‌కుమార్, ముడారి పురుషోత్తం, జి.గజానంద్, రాజేశం, పిజ్జు తదితరులు పాల్గొన్నారు.

# వైభవంగా శ్రీహనుమాన్ జయంతి వేడుకలు

**చార్మినార్, ఏప్రిల్ 6 ప్రభాతవార్త :** హైదరాబాద్ పాతబస్తీలోని పలు ప్రాంతాలలో గురువారం శ్రీహనుమాన్ జయంతి వేడుకలను ప్రజలు అత్యంత వైభవంగా నిర్వహించారు. ఘాన్సీ బజార్, కోకరివాడి, ఝూలా, చేలాపుర, ఉర్దూగల్లీ, బండిఅడ్డ, మామా జుమ్లా పాఠక్‌తో పాటు పలు ప్రాంతాలలో శ్రీ హనుమాన్ శోభాయాత్ర కన్నుల పండువగా కొనసాగింది. దూద్ బౌలి, పురానాపూల్, గౌలిపుర, ఛత్రినాక, జంగమ్మెట్, అలియాబాద్, ఉప్పుగూడ ప్రాంతాలలోని దేవాలయాలలో భక్తులు అత్యంత భక్తి శ్రద్దలతో శ్రీ హనుమాన్‌కు పూజలు, అభిషేకాలు జరిపారు. కాగా హైకోర్టు చంపా దర్వాజ శ్రీహనుమాన్ మందిరంలో వైభవంగా శ్రీహనుమాన్ వేడుకలు జరిగాయి. ఘాన్సీ బజార్ డివిజన్ బిజెపి అధ్యక్షులు సత్యప్రకాష్ తాహెల్, న్యాయవాది విశాల్ కేడియోతో పాటు పలువురు హనుమాన్ మందిరంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కాగా గురువారం పాతబస్తీలోని నిర్వహించిన శ్రీ హనుమాన్ శోభా యాత్ర సందర్భంగా దక్షిణ మండలం పోలీసులు బందోబస్తును ఏర్పాటు చేశారు.

**తిరుమలగిరిలో**

**తిరుమలగిరి, ఏ ప్రిల్ 6ప్రభాతవార్త:** తిరులగిరిలోని చిన్నకమేళా, పెద్ద కమేళా తదితర కాలనీలలో ఉన్న దేవాలయాల్లో గురువారం హన్‌మాన్ జయంతి వేడుక లను ఘనంగా జరుపుకున్నారు. జయంతి వేడుకల్లో భాగంగా తిరుమలగిరిలోని హన్‌మాన్ దేవాలయాల్లో మల్కాజిగిరి పార్లమెంట్ బిఆర్ఎస్ ఇన్‌ఛార్జి మర్రి రాజశేఖర్ రెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో మాజీ బోర్డు సభ్యురాలు ప్యారసాని భాగ్యశ్రీ, మాజీ ఉపాధ్యక్షులు జక్కుల మహేశ్వర్ రెడ్డి, ఎమ్మెల్యే సాయన్న కూతురు లాస్య నందిత, మాజీ బోర్డు సభ్యుడు పాండు యాదవ్, ప్రభాకర్, బిఆర్ఎస్ నాయకులు ముప్పిడి మధుకర్, ప్రవీణ్ యాదవ్, రాజుసింగ్, సురేశ్ వేణు పాల్గొన్నారు.

**లాల్‌బజార్‌లో...**

లాల్‌బజార్‌లోని పురాతన హన్‌మాన్ దేవాలయంలో తెలంగాణ ఉద్యమ కారులు,బిఆర్ఎస్ నాయకులు రంగ రవిందర్ గుప్త హన్‌మాన్ జయంతి వేడుకల్లో పాల్గొని ప్రత్యే క పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

**యూసుఫ్‌గూడలో...**

**యూసుఫ్‌గూడ, ఏప్రిల్ 6, ప్రభాతవార్త**

హనుమాన్ జయంతి సందర్భంగా వాడవాడలా ఆలయాలలో హనుమాన్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచే భక్తులు పెద్ద సంఖ్యలో ఆలయాలలో పూజల్లో పాల్గొన్నారు. హైమావతి నగర్‌లోని శ్రీప్రసన్నాంజయనేయ స్వామి దేవాలయంలో జరిగిన పూజ కార్యక్రమాల్లో ఆలయ కమిటి చైర్మన్ డాక్టర్ గూడూరి చెన్నారెడ్డి కుటుంబ సమేతంగా పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం పెద్ద ఎత్తున అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈకార్యక్రమంలో దూడల రవి గౌడ్, కౌహెచ్ఎస్ శర్మ, అరవింద్, సురేందర్, నర్సింగ్, మురళీ, జి.శ్రీనువాస్, తదితరులు పాల్గొన్నారు.

**ఎర్రగడ్డలో...**

**యూసుఫ్‌గూడ, ఏప్రిల్ 6, ప్రభాతవార్త**

హనుమాన్ జయంతి సందర్భంగా ఎర్రగడ్డ ఆనంద్ నగర్‌లో ఏర్పాటు చేసిన పూజ కార్యక్రమాలలో డి.సంజీవ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదానం జరిగింది.

**వెంకటగిరిలో...**

వెంకటగిరిలో శ్రీవీరాంజనేయ స్వామి దేవాలయంలో హనుమాన్ జయంతి వేడుకలను అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఉదయం నుంచే సుప్రభాత సేవ, అభిషేకం, భక్తులకు అన్నదాన కార్యక్రమం అనంతరం స్వామి వారిని పల్లకిలో వెంకటగిరి పురవీదుల్లో తిరుగతూ పాటలు పాడుతూ నృత్యాలు చేస్తూ ఊరేగించారు. ఈకార్యక్రమం దేవాలయం కమిటి సభ్యులు సుదర్శన్‌రావు, జ్ఞానేశ్వర్, పులిరామ్, బడుగు సతీష్, రామాంజనేయులు, ఆలయ అర్చకులు సంతోష్ శర్మ, వేణు శర్మ, తదితరులు పాల్గొన్నారు.

**బోరబండ చౌరస్తాలో...**

బోరబండ చౌరస్తాలోని శ్రీవీరాంజనేయ స్వామి దేవాలయంలో స్వామివారికి అభిషేకంలు, హోమం, అనంతరం భక్తులకు పెద్దఎత్తున అన్నదానం, జరిగింది. నూతనంగా నిర్మించిన శ్రీవీరాంజనేయ ఆలయంలో హనుమాన్ జయంతి వేడుకలను కన్నుల పండగగా నిర్వహించామని ఆలయ చైర్మన్ జి.లక్ష్మన్ గౌడ్ తెలిపారు. ఈకార్యక్రమంలో ఆలయ ధర్మకర్తలు కృష్ణమోహన్, రమేష్ యాదవ్, జంగయ్య, రాములు ముదిరాజ్, ధనలక్ష్మీ, జశ్వంతయ్య, రవిందర్, సురేందర్, లడ్డు, విజయ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

**కార్వాన్‌లో శోభాయాత్రలో పాల్గొన్న ఈటల**

**మెహిదీపట్నం, ఏప్రిల్ 6, ప్రభాతవార్త :** హనుమాన్ జయంతి వేడుకలు గురువారం కార్వాన్ లో భక్తిశ్రద్దలతో జరిగాయి. హనుమాన్ భక్తులు కార్వాన్ పురవీధుల్లో ర్యాలీలు నిర్వహిస్తూ జై హనుమాన్ అంటూ నినాదాలు చేయడంతో కార్వాన్ పురవీధులన్నీ హనుమాన్ నామస్మరణతో మార్మోగాయి. తాళ్లగడ్డ హనుమాన్ దేవాలయంలో బిజెపి కార్వాన్ డివిజన్ కంటెస్టెడ్ కార్పోరేటర్ కట్ల అశోక్ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం శోభయాత్రను ప్రారంభించారు. ఈ శోభయాత్రలో హుజురాబాద్ ఎమ్మెల్యే ఈటల రాజేందర్ పాల్గొని మాట్లాడారు. హిందువులు ఐకమత్యంగా ఉంటూ హిందూ భావ జాలాన్ని కాపాడుకోవాలని కోరారు. శోభయాత్రను కార్వాన్ కేసరి హనుమాన్ దేవాలయం వరకు నిర్వహించారు. ఈ శోభయాత్రలో హనుమాన్ భక్తులు, యువకులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

**బేగంబజార్‌లో..**

**బేగంబజార్, ఏప్రిల్ 6ప్రభాతవార్త:** హన్‌మాన్ జయంతిన్ని పురస్కరించుకుని గురువారం నిర్వహించిన శోభయాత్రలో యువకులు భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు.కోఠి వద్ద వేసి స్వాగత వేధిక నుంచి గోషామహల్ నియోజకవర్గం బిఆర్ఎస్ నాయకులు గడ్డం ఆశీష్‌కుమార్‌యాదవ్ శోభయాత్రకు స్వాగతం పలికారు. కార్యక్రమంలో తదితరులు పాల్గొన్నారు.



శోభాయాత్రను పర్యవేక్షిస్తున్న నగర అదనపు పోలీసుకమిషనర్(లా అండ్ ఆర్డర్) విక్రమ్‌సింగ్‌మాన్, ఉన్నతాధికారులు

**ఆర్టీసి క్రాస్‌రోడ్స్‌లో...**

**చిక్కడపల్లి, ఏప్రిల్ 6 ప్రభాతవార్త:** హనుమాన్ శోభాయాత్ర ఆర్టీసిక్రాస్‌రోడ్స్‌లో గురువారం అట్టహాసంగా సాగింది. భారీ వర్షం కురవడంతో ర్యాలీ కొంత ఆలస్యం అయింది. సరిగ్గా ర్యాలీ మూడు గంటల ప్రాంతంలో ఆర్టీసిక్రాస్‌రోడ్స్‌కు చేరుకున్న శోభాయాత్రకు ప్రజలు ఘనస్వాగతం పలికారు. 'జైశ్రీరామ్' అంటూ కార్యకర్తలు, ప్రజలు పెద్దపెట్టున నినాదాలిచ్చారు. చిక్కడపల్లి నుంచి ఆర్టీసిక్రాస్‌రోడ్స్ నుంచి అశోక్‌నగర్ వరకు సాగిన ర్యాలీలో వేలాది మంది స్థానిక ప్రజలు పాల్గొని తమ భక్తిని చాటుకున్నారు. నగర అదనపు పోలీసు కమిషనర్( లా అండ్ ఆర్డర్) విక్రమ్‌సింగ్ మాన్, సెంట్రల్ జోన్ డీసీపీ ఎం.వెంకటేశ్వర్లు, అదనపు డీసీపీ ఆర్.రమణారెడ్డి, చిక్కడపల్లి ఏసీపీ యాదగిరి, ఏసీపీ వై.నరసింహారెడ్డి, సీసీఎస్ ఏసీపీ హరీశ్‌కౌషిక్, శ్రీధర్ చిక్కడపల్లి, ముషీరాబాద్, గాంధీనగర్ ఇన్‌స్పెక్టర్‌లు ఎన్.సంజయ్‌కుమార్, జహంగీర్‌యాదవ్, ఎన్.మోహన్‌రావు,చిక్కడపల్లి డీఐ పి.నరేశ్, డిఎస్ఐ కె.శిశుపాల్‌రెడ్డి, అడ్మిన్ఎస్ఐ కె.వెంకటరమణ, ఎస్ఐలు సిహెచ్.నాగరాజు, ఎ.సందీప్ రెడ్డి, జె.కిరణ్‌కుమార్, సిహెచ్.శ్రీనివాస్‌రెడ్డి, పి.అభిలాష్, సెంట్రల్ జోన్ ట్రాఫిక్ ఏసీపీ పి.మురళీకృష్ణ, చిక్కడపల్లి, సైఫాబాద్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్‌లు నానూనాయక్, ఎ.రమేశ్ తదితరులు బందోబసు_ను పర్యవేక్షించారు. రామ్‌నగర్, గాంధీనగర్ కార్పొరేటర్లు రవిచారి, ఎ.పావనీ వినయ్‌కుమార్ ఆధ్వర్యంలో స్వాగత ఏర్పాట్లు చేశారు. కార్యక్రమంలో బిజెపి నగర నాయకుడు ఎ.వినయ్‌కుమార్, గడ్డం నవీన్ తదితరులు పాల్గొన్నారు. క్రాస్‌రోడ్స్‌లో నాలుగుదార్లు మూసివేసి కేవలం ర్యాలీ వెళ్లేడానికి వీలుగా ఏర్పాట్లు చేసి శోభాయాత్ర ప్రశాంతంగా సాగేలా చర్యలు తీసుకున్నారు. భారీ వర్షాన్ని సైతం లెక్కచేయకుండా ఆర్టీసిక్రాస్‌రోడ్స్‌లో ర్యాలీ సందర్భంగా నిర్వహించిన పలు విన్యాసాలు అనేక మందిని ఆకట్టుకున్నాయి. ర్యాలీలో పాల్గొన్న బాలలు హనుమాన్ వేషదారణలతో అందరి దృష్టిని ఆకర్షించారు. అంతా చిన్న పిల్లలే ఈ నృత్యాలు పాలుపంచుకుని హనుమాన్ శోభాయాత్రకు నిండుదనం తీసుకువచ్చారు.ర్యాలీలో వచ్చిన అన్ని వాహనాలను ఆపి ఐదారుసార్లు కాషాయ జెండాను ఊపి ర్యాలీలో పాల్గొన్న వారికి ఘనస్వాగతం పలికారు. గతంలో జరిగిన అనుభవాలను దృష్టిలో ఉంచుకుని ముందుగానే ఆర్టీసిక్రాస్‌రోడ్స్ ప్రాంతాన్ని పోలీసులు స్వాధీనంచేసుకున్నారు. అగ్నిమాపక వాహనాలను రప్పించారు. చిక్కడపల్లి వాణిజ్య వ్యాపార సంస్థలన్ని ముందస్తుగానే మూసివేశారు. దాదాపు పోలీసు పహారా నడుమ యాత్ర కొనసాగింది. క్రాస్ రోడ్స్ ప్రాంతంలో వాటర్ క్యానన్‌లతో పాటు, పలు ప్లటూన్ల పోలీసులతోపాటు సబ్ ఇన్‌స్పెక్టర్లు, ఇన్‌సె ఎక్టర్లు, పోలీసుకానిస్టేబుళ్లు, హోం గార్డులు, హెడ్‌కానిస్టేబుళ్ల తో ప్రత్యేక సెక్యూరిటీ సిబ్బందితోపాటు చిక్కడపల్లి మైత్రి సంఘం సభ్యులు బందోబస్తులో పాల్గొన్నారు. కాగా హనుమాన్ శోభ యాత్ర ఫలితంగా ఉదయం పది గంటల నుంచి సాయంత్రం నాలుగున్నర గంటల వరకు పోలీసులు వాహనాల దారిమళ్లింపు చేపట్టడం తో వాహనదారులు, పాదచారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. మొత్తంగా ర్యాలీ ప్రశాంతంగా ముగియడంతో పోలీసులు ఊపిరిపీల్చుకున్నారు. శోభయాత్ర తాడ్‌బండ్ ఆంజనేయస్వామి ఆలయానికి వేళ్లవరకు పోలీసులు క్రాస్‌రోడ్స్ తదితర సమస్యాత్మక ప్రాంతాలలో నిఘా ఏర్పాటు చేశారు. పోలీసులకు ప్రజలు, నిర్వాహకులు సంపూర్ణ సహకారాలను అందించడం మూలంగా శోభయాత్ర ప్రశాంతంగా ముగియడం పట్ల పోలీసులు సంతృప్తి వ్యక్తం చేశారు.

**బాచుపల్లిలో...**

**నిజాంపేట్, ఏప్రిల్ 6 ప్రభాతవార్త:** కుత్బుల్లాపూర్ నియోజకవర్గం నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధి బాచుపల్లిలోని రాజీవ్‌గాంధీనగర్‌లో ఫ్లోర్ లీడర్ ఆగం పాండు ఆధ్వర్యంలో నిర్వహించిన హనుమాన్ జయంతి వేడుకలకు గురువారం ప్రభుత్వ విప్, మేడ్చల్ జిల్లా బీఆర్ఎస్ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ శంభీపూర్‌రాజు ముఖ్య అతిధిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా నియోజకవర్గం ప్రజలందరికి హనుమాన్ జయంతి శుభాకాంక్షలు తెలియజేసి వేడుకలను ప్రశాంతంగా జరుపుకోవాలని ఎమ్మెల్సీ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ ధన్‌రాజ్‌యాదవ్, భౌరంపేట్ పీఏసీఎస్ చైర్మన్ బాల్‌రెడ్డి, కార్పొరేటర్లు ఆగం రాజు, బాలాజీ నాయక్, బీఆర్ఎస్ నాయకులు, పార్టీ శ్రేణులు, భక్తులు పాల్గొన్నారు.



తాడ్‌బండ్ హన్‌మాన్ దేవాలయంలో వద్ద మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్

## తాడ్‌బండ్ హన్‌మాన్ దేవాలయంలో మంత్రి పూజలు

**కంటోన్మెంట్, ఏ ప్రిల్ 6 ప్రభాతవార్త:** హన్‌మాన్ జయంతిని పురస్కరించుకొని గురువారం 6వ వార్డులోని తాడ్‌బండ్ దేవాలయంలో నిర్వహించిన పూజా కార్య క్రమాలకు రాష్ట్ర పశుసంవర్ధక, సినిమాటోగ్రాఫీ శాఖల మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ బోర్డు సభ్యుడు పాండు యాదవ్ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్‌కు శాలువకప్పి పూలమాలలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో బోయిన్‌పల్లి మార్కెట్ మాజీ చైర్మన్ టీ.ఎన్.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు. అదే విధంగా పాండు యాదవ్ ఆధ్వర్యంలో 300 బైక్‌లతో సీతారామ్‌పూర్‌నుంచి బైక్ ర్యాలీ నిర్వహించారు.

### మానసిక ప్రశాంతతకు దేవుళ్లను పూజించాలి : మన్నె క్రిషాంక్

**కంటోన్మెంట్, ఏ ప్రిల్ 6 ప్రభాతవార్త:** మానసిక ప్రశాంతతకు దేవుళ్లను పూజించాలని, భగవంతున్ని వేడుకుంటే కోరుకున్న కోర్కెలు నెరవేరుతాయని తెలంగాణ రాష్ట్ర మినరల్ డెవలప్‌మెంట్ కార్పోరేషన్ చైర్మన్ మన్నె క్రిషాంక్ తెలిపారు. హన్‌మాన్ జయంతిని పురస్కరించుకొని కంటోన్మెంట్ 6వ వార్డులోని హన్‌మాన్ దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణంలో భక్తులందరికి క్రిషాంక్ చేతుల మీదుగా మజ్జిగ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ నేతలు మోని, రఘు, సాయి, సాగర్,రాజు పాల్గొన్నారు.

## బిజెపితోనే అభివృద్ధి సాధ్యం

**బిజెపి నాయకులు చేతన్ సూరి**

**చార్మినార్,ఏప్రిల్ 6 ప్రభాతవార్త :** బిజెపితోనే అభివృద్ధి సాధ్యమవుతుందని సీనియర్ బిజెపి నాయకులు చేతన్ సూరి అన్నారు.చార్మినార్ నియోజకవర్గంలో గురువారం జరిగిన బిజెపి 43వ వ్యవస్థాపక దినోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న చేతన్ సూరి బిజెపి పార్టీ పతాకాన్ని ఆవిష్కరించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం హయాంలోనే దేశం అన్ని రంగాలలోను ఎంతగానో అభివృద్ధి చెందిందని తెలిపారు.రానున్న ఎన్నికల్లో తెలంగాణలో బిజెపి తప్పకుండ అధికారంలోకి వస్తుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో పలువురు బిజెపి నాయకులు పాల్గొన్నారు.

## ట్రీ ప్లాంటేషన్ డ్రైవ్ నిర్వహించిన విద్యార్థులు

**హైదరాబాద్, ఏప్రిల్ 6,ప్రభాతవార్త:** మన ఉనికికే పెనుముప్పుగా పరిణమిస్తున్న వాతావరణ మార్పులను ఎదుర్కొనేందుకు చెట్లను నాటడం వంటి కార్యక్రమాల ప్రాముఖ్యతను పురస్కరించుకుని పలువురు విద్యార్థులు ట్రీ ప్లాంటేషన్ డ్రైవ్‌ను నిర్వహించారు. హైదరాబాద్ శంకర్‌పల్లిలోని ఇండస్ ఇంటర్నేషనల్ స్కూల్ విద్యార్థులు 2023 గ్రాడ్యుయేషన్ బ్యాచ్ ఈకార్యక్రమాన్ని చేపట్టారు. త్వరలో గ్రాడ్యుయేట్లు కాబోతున్న విద్యార్థులు పాఠశాల ఆవరణలోని ఆర్గానిక్ ప్లాంట్ గార్డెన్‌లో 120కిపైగా మొక్కలు నాటారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ పర్యావరణం శక్తివంతం చేయడానికి ,మనచుట్టూ ఉన్న వాతావరణం పట్ల సృహాకలిగపంచడానికి ఇటువంటి కార్యక్రమాలు చేపడుతున్నట్లు పేర్కొన్నారు.



మొక్కలు నాటుతున్న విద్యార్థులు

## అన్ని దానాల్లోకెల్లా అన్నదానం గొప్పది: శ్రీగణేష్

**కంటోన్మెంట్,ఏ ప్రిల్ 6 ప్రభాతవార్త:** అన్నిదానాలో కన్న అన్నదానం గొప్పదని ఎస్.జి.ఎఫ్.పౌండర్, బిఆర్ఎస్ నేత ఎన్.శ్రీగణేష్ తెలిపారు. హన్‌మాన్ జయంతిని పురస్కరించుకొని గురువారం కంటోన్మెంట్‌లోని రెజిమెంటల్ బజార్, తాడ్‌బండ్ హన్‌మాన్ దేవాలయం, కాకగూడ, బొల్లారం పరిసర ప్రాంతాల్లోని హన్‌మాన్ దేవాలయాల్లో నిర్వహించిన వేడుకల్లో ఆయన పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. మోండా డివిజన్‌లోని సెకండ్ బజార్‌లో సతీష్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అన్నదాన కార్ యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మోండా డివిజన్ అధ్యక్షుడు ఆకుల హరిక్రిష్ణ, నాయకులు గౌతమ్, శరత్, మల్లేశ్, భాస్కర్ గౌడ్, బిక్షపతి, విష్ణు తదితరులు పాల్గొన్నారు.

### మానసిక ప్రశాంతకు దేవుళ్లను పూజించాలి : జంపనప్రతాప్

**కంటోన్మెంట్, ఏ ప్రిల్ 6 ప్రభాతవార్త:** మానసిక ప్రశాంతకు దేవుళ్లను పూజించాలని కంటోన్మెంట్ బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జంపనప్రతాప్ హన్‌మాన్ జయంతిని పురస్కరించుకొని బోయిన్‌పల్లి పెద్దతోకట్ట, దాసాంజనేయస్వామి, ఏడుగుళ్లు, వీరాంజనేయ ఎస్వామి దేవాలయంలో నిర్వహించిన వేడుకల్లో ఆయన పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన అన్నదాన కార్యక్రమాన్ని జంపన ప్రారంభించారు.

### తాడ్‌బండ్ హన్‌మాన్ దేవాలయంలో హన్‌మాన్ జయంతి

**కంటోన్మెంట్, ఏ ప్రిల్ 6 ప్రభాతవార్త:** హన్‌మాన్ జయంతిని పురస్కరించుకొని గురువారం కంటోన్మెంట్ 6వ వార్డు తాడ్‌బండ్ హన్‌మాన్ దేవాలయంలో నిర్వహించిన ప్రత్యేక పూజా కార్యక్రమాలకు మల్కాజిగిరి పార్లమెంట్ బిఆర్ఎస్ ఇన్‌ఛార్జి మర్రి రాజశేఖర్ రెడ్డి పాల్గొని ప్రత్యే క పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కంటోన్మెంట్ బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జక్కుల మహేశ్వర్ రెడ్డి, మాజీ బోర్డు సభ్యులు పాండు యాదవ్, బిఆర్ఎస్ నాయకులు ముప్పిడి మధుకర్, ప్రవీణ్ యాదవ్, రాజు సింగ్ తదితరులు పాల్గొన్నారు.

### దేవాలయాల్లో పూజలు చేసిన సాయన్న కూతుళ్లు

కంటోన్మెంట్,ఏ ప్రిల్ 6 ప్రభాతవార్త: హన్‌మాన్ జయంతిని పురస్కరించుకొని గురువారం కంటోన్మెంట్ నియోజకవర్గంలోని పలు దేవాలయాల్లో నిర్వహించిన హన్‌మాన్ జయంతి వేడుకల్లో కంటోన్మెంట్ ఎమ్మెల్యే సాయన్న కూతుర్లు లాస్య నందిత, నివేదితలు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ మాజీ చైర్మన్ టీ.ఎన్.శ్రీనివాస్, బిఆర్ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## జూపార్కులో కిడ్నీ వ్యాధితో బెంగాలీ టైగర్ మృతి

**చార్మినార్, ఏప్రిల్,6 ప్రభాతవార్త :** హైదరాబాద్ పాతబస్తీ బహదూర్ పుర శివారులో ఉన్న నెహ్రూ జూలాజికల్ పార్కులో బుధవారం జో అనే మగ బెంగాలీ టైగర్ మృతి చెందింది. జూ పార్కులోని జో అనే బెంగాలీ మగ టైగర్(10) ఆరు నెలలు నుంచి కిడ్నీ వ్యాధితో బాధ పడుతున్నది.జూ పార్కుకు చెందిన వైద్యులు బెంగాలీ టైగర్ జో కు అన్ని రకాల వైద్య సేవలు అందిస్తున్నారు.కాగా బుధవారం బెంగాలీ టైగర్ జో ఆరోగ్య పరిస్థితి విషమించటంతో మృతి చెందిందని జూ అధికారులు వెల్లడించారు.కాగా ప్రస్తుతం జూపార్కులో ప్రస్తుతం 19 బెంగాలీ టైగర్లు ఉన్నాయి.

## ప్రమాదంలో గాయపడిన వ్యక్తి చికిత్స పొందుతూ మృతి

**పేట్‌బషీరాబాద్,ఏప్రిల్6 ప్రభాతవార్త:**రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి చికిత్స పొందుతూ మృతిచెందిన సంఘటన పేట్‌బషీరాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో గురువారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఓ వ్యక్తి టీఎస్11ఈపి1067 నెంబర్ గల టీవీఎస్ ద్విచక్ర వాహనంపై కొంపల్లి నుంచి సుచిత్ర వైపు వెళ్తున్న సమయంలో గుర్తు తెలియని వాహనం వేగంగా వచ్చి ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టింది.ఈ ప్రమాదంలో ద్విచక్రవాహనదారుడి తీవ్ర గాయాలు కాగా స్థానికులు గమనించి 100కి డయల్ చేసి పోలీసులకు సమాచారం అందించారు.సమాచారం అందుకున్న పేట్‌బషీరాబాద్ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని గాయపడిన వ్యక్తిని చికిత్స నిమిత్తం గాంధీ ఆసుపత్రికి తరలించారు. అయితే గాయపడిన వ్యక్తి చికిత్స పొందుతూ గురువారం ఉదయం 9గంటల సమయంలో మృతిచెందాడు. ఈ మేరకు పోలీసులు ద్విచక్ర వాహనం నెంబర్ ఆధారంగా వివరాలు సేకరించి జావీద్ అనే వ్యక్తికి సం బందించినదని గుర్తించారు. మృతుడి వివరాలు తెలిసిన వారు పేట్‌బషీరాబాద్ పోలీస్ స్టేషన్‌లో సంప్రదించాలని,ప్రమాదానికి కారణమైన గుర్తుతెలియని వాహనంపై కేసు నమోదు చేసుకొని సీసీ ఫుటేజ్ ఆధారంగా పరిశీలిస్తున్నామని పోలీసులు తెలిపారు.

## బండి సంజయ్‌పై పెట్టిన అక్రమకేసులను ఉపసంహరించాలి

**చిక్కడపల్లి, ఏప్రిల్ 6 ప్రభాతవార్త:** బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్‌పై అక్రమ కేసులు బనాయించి జైలులో పెట్టడం అప్రజాస్వామికమని బిజెపి మహబూబ్‌నగర్ జిల్లా ఇంచార్జ్, బిజెవైఎం పూర్వ రాష్ట్ర అధ్యక్షుడు గుండగోని భరత్‌గౌడ్ అన్నారు. గురువారం హనుమాన్ శోభాయాత్ర సందర్భంగా చిక్కడపల్లి, బాగ్‌లింగంపల్లి ప్రాంతాలలో ఏర్పాటు చేసిన స్వాగత వేదికల వద్ద హనుమజ్జయంతి సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా శోభయాత్రలో పాల్గొంటున్న వారికి స్వాగతం పలికారు. కార్యక్రమంలో బిజెపి నేతలు కిరణ్, గోపి, సోమ సతీష్ తదితరులు పాల్గొన్నారు. బేషరతుగా వెంటనే బండి సంజయ్‌ని విడుదల చేయాలని, అక్రమ కేసులను వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు.

**ఆర్టీసిక్రాస్‌రోడ్స్‌లో...**

హనుమాన్ జయంతి సందర్భంగా వీరహనుమాన్ శోభాయాత్రకు గాంధీ నగర్ డివిజన్ బిజెవైఎం ఆధ్వర్యంలో స్వాగత వేదికలను ఏర్పాటుచేసి ఘనంగా స్వాగతం పలికారు. బిజెవైఎం పూర్వ జిల్లా అధ్యక్షుడు ఎ.వినయ కుమార్, బిజెవైఎం మహాంకాళి జిల్లా నగర అధ్యక్షుడు మద్దూరి శివాజీ, ఓబీసీ మోర్చ జాతీయ కార్యవర్గసభ్యులు పూస రాజు, బిజెవైఎం గాంధీనగర్ అధ్యక్షుడు జి.అరుణ్‌కుమార్, మదన్మోహన్, ఆనంద్‌రావు, ఆకుల అభిషేక్, సాయి, తరుణ్, రాహుల్, కార్తీక్, సంపత్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

### హిమాయత్‌నగర్‌లో వైభవంగా బిజెపి ఆవిర్భావ దినోత్సవం

నాంపల్లి, ఏప్రిల్ 6 ప్రభాతవార్త : భారతీయ జనతా పార్టీ 43వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను హిమాయత్‌నగర్ డివిజన్ కారొ ్పరేటర్ మహాలక్ష్మి రామన్‌గౌడ్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె బిజెపి రాష్ట్ర నాయకులు జి.రామన్‌గౌడ్, నర్సింగ్‌గౌడ్, జైశ్వాల్, మల్లేష్, సందీప్, జాకి, బిందియా, వీరనాయక్, కొండయ్య, ప్రవీణ్, వేణుగోపాల్‌యాదవ్, అనిల్, భాను తదితరులతో కలిసి పార్టీ జెండా ఆవిష్కరించి హిమాయత్‌నగర్ డివిజన్ పరిధిలో చేపట్టిన, చేస్తున్న వివిధ ప్రజాహిత, సామాజిక సేవా కార్యక్రమాల గురించి వివరించి, అందుకు తోడ్పాటునిస్తున్న డివిజన్ ప్రజలందరికి కృతజ్ఞతలు తెలిపారు.

**ఫీవర్ ఆస్పత్రి కూడలిలో...**

హైదరాబాద్, ఏప్రిల్ 6 ప్రభాతవార్త : నల్లకుంట ఫీవర్ ఆస్పత్రి కూడలిలో బిజెపి నాయకులు ఎం.మధుసూదన్ యాదవ్, డా. గౌతమ్‌రావు, కార్పొరేటర్ అమృత, రమణనాయుడు, శిరీష, శ్రీనివాస్, చందు, రమేష్, శ్రావణ్, రోజ్‌గోపాల్, శివ, లక్ష్మణ్, సంధ్య, జ్యోతి, వరలక్ష్మి, రమ్య, కౌషిక్, విజయ్ తదితరులు పార్టీ 43వ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని బిజెపి జెండాను ఎగురవేసి ప్రసంగించారు.

**బండిసంజయ్ అరెస్టుకు నిరసనగా**

## అంబేద్కర్ విగ్రహం వద్ద నల్లబ్యాడ్జీలతో నిరసన

**నాచారం, ఏప్రిల్ 6 ప్రభాతవార్త:** బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ అరెస్టుకు నిరసనగా నాచారం అంబేద్కర్ విగ్రహం వద్ద పలువురు బిజెపీ నేతలు నల్లబ్యాడ్జీలతో మౌన దీక్ష చేసి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా జిల్లా అధికార ప్రతినిధి పోతగాని గోపాల్‌గౌడ్, నాయకులు నాగిరి మోహన్‌రెడ్డి మాట్లాడుతూ టీఎస్‌పీఎస్సీ పేపర్ ఇతర అంశాల గురించి బండి సంజయ్ ప్రశ్నించడంతోనే ఈ ప్రభుత్వం అరెస్టు చేసిందన్నారు. ఎవరు ప్రశ్నించిరా అరెస్టులు చేపిస్తున్నారని ఆరోపించారు. అక్రమంగా అరెస్టు చేసిన బండి సంజయ్‌ని ప్రభుత్వం బేషెరతుగా విడుధల చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో గిరిజన మోర్చ ప్రధాన కార్యదర్శి రవినాయక్, హన్మంత్ బిరాదర్, మల్క్శప్రకాష్, నవీన్‌కుమార్, అభిషేక్ గౌడ్, దయా గౌడ్, ఉదయ్ రెడ్డి, వెంకటేష్ గౌడ్, అనితా రెడ్డి, వరలక్ష్మితో పాటు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



నాచారం అంబేద్కర్ విగ్రహం వద్ద నల్లబ్యాడ్జీలతో నిరసన చేస్తున్న గోపాల్‌గౌడ్ తదితరులు



వీరాంజనేయ స్వామి శోభాయాత్రలో పాల్గొన్న భాజపా నాయకులు నెమలి ఆనంద్

## జై శ్రీరాం నినాదాలతో కదిలిన వీరాంజనేయ శోభాయాత్ర

**బేగంపేటలో పూజలు చేసిన భాజపా నేత నెమలి ఆనంద్**

**బేగంపేట ఏప్రిల్ 6, ప్రభాతవార్త :** హనుమత్ విజయోత్సవ యాత్రలో భాగంగా హిందూ వాహిని,భజరంగ్ దళ్ ఆధ్వర్యంలో ప్రారంభించిన వీరాంజనేయ స్వామి శోభాయాత్రలో భాజపా నాయకులు నెమలి ఆనంద్ పాల్గొని పూజలు నిర్వహించారు. బేగంపేటలో ఆయన పూజలు నిర్వహించారు.ఈ సందర్భంగా హిందూ వాహని కార్యకర్తలు ఆనంద్‌ను శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా ఆనంద్ మాట్లాడుతూ హనుమత్ విజయోత్సవ ర్యాలీలో ప్రతి ఏటా పాల్గొనే వారి సంఖ్య పెరగడం ఎంతో సంతోషంగా ఉందన్నారు.ఈ యాత్రలో నాథో శ్రవణ, ప్రమోద్,విశాల్ వరుణ్ తదితరులు పాల్గొన్నారు.

### డివిజన్‌లో బిజెపి ఆవిర్భావ దినోత్సవ వేడుకలు

**పేట్‌బషీరాబాద్,ఏప్రిల్6 ప్రభాతవార్త:** బిజెపి 43వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా కుత్బుల్లాపూర్ నియోజకవర్గం జీడిమెట్ల డివిజన్ పరిధి సుచిత్ర చౌరస్తాలో గురువారం మేడ్చల్ జిల్లా అర్బన్ కార్యదర్శి చెరుకుపల్లి భరతసింహారెడ్డి పార్టీ జెండాను ఎగురవేశారు. ఈ సందర్భంగా భరతసింహారెడ్డి మాట్లాడుతూ రాబోయే ఎన్నికల్లో బీజేపీ పార్టీ అధికారమే లక్ష్యంగా ప్రతి ఒక నాయకుడు, కార్యకర్త కృషిచేయాలన్నారు. కార్యక్రమంలో నాయకులు బలరాం, ఝాన్సీ, కృష్ణ, ప్రతాప్, చిన్నారెడ్డి,ప్రభా కర్‌రెడ్డి, లక్ష్మణ్, ప్రసాద్‌శర్మ, రాజు, తిరుపతయ్య, చౌదరి, అంజయ్య, పాపాయ్య, సతీష్, మాధురి, శ్రవణ్‌గౌడ్, సందీప్‌గౌడ్, మహేష్‌గౌడ్, శ్రీకాంత్‌రెడ్డి, నాగదీప్‌గౌడ్, వర్మ, శ్రవణ్, శివ పాల్గొన్నారు.


తెలంగాణ ప్రభుత్వం
హైదరాబాద్ మహానగర పాలక సంస్థ
GHMC

నిట్ నం.03/Div-13 (old 7B)/GHMC/2023-2024.

పనిపేరు: సివిల్ పనులు (1నం.) అంచనా మొత్తం: రూ. 25.60 లక్షలు. బిడ్స్ స్వీకరణకు ప్రారంభ తేదీ/వివరి తేదీ, సమయం : 06.04.2023 ఉ.11.00గం. నుండి 11.04.2023 ఉ.11.00గం. వరకు. అధికారి పేరు, చిరునామా, సెల్ నెం: ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, డివిజన్ నెం. 13, (Old-7B) (KZ) GHMC ఖైరతాబాద్ హైదరాబాద్ 9154960552. తదుపరి వివరాలు www.tender.eprocurement.gov.in వద్ద చూడవచ్చును.

సం/- ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, డివిజన్ నెం.13 (Old-7B), GHMC.

DIPR.No.88-PP/CL/Advt/1/2023-24 తేదీ: 06.04.2023



వార్త VAARTHA CLASSIFIEDS CLASSIFIEDS వార్త VAARTHA CLASSIFIEDS

LOSS OF PASSPORT

★ I, KRISHNA MOHAN KUMAR S/o. ARCOT MOHAN RAO KRISHNA KUMAR, R/o. H.No.SCB No.4-06-004 (Old No.3-6-100/A/4) SRK Cly. West Marredpally, Hyd. While I was taking my Passport from my Residence in West Marredpally to the Xerox Centre I have lost the Original Passport bearing No.K3621835. If found Plz Cont: 9394579000.

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగినరీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లైయిములతో "వార్త" దినపత్రికకు ఏ విధమైన సంబంధం లేదు.



**IN THE COURT OF THE HON'BLE, I ADDL.JUNIOR CIVIL JUDGE,RANGAREDDY DISTRICT, AT: L.B. NAGAR**
**O.S.NO. 217 OF 2023**

**BETWEEN:**
VELISHETTY DAYANAND, S/o Late Buchi Ramulu, Aged about 72 years, Occ: Business, H.No.11-246/1, Balaji Nagar, Nadergul Village, Balapur Mandal,Ranga Reddy District
**.... Plaintiffs**
**AND**
1. The Tahsildar, Balapur Mandal, Ranga Reddy District.
2. ALL CONCERNED
**.... Defendants**

**NOTICE**

Please take notice that the Plaintiffs herein have filed the above suit seeking declaration to Declare the Plaintiffs as the LEGAL HEIRS of Late Smt. Velishetty Padma, which is posted to **17/04/2023** by the Hon'ble Court to receive the objections of persons opposing. If any person or persons have any objections, claim or concern of whatsoever against such relief they may put forth their objections before the Hon'ble court on **17/04/2023 at 10:30** a.m. either personally or through authorized counsel or otherwise the matter will be adjudicated in due process of law. Hence this Notice.
(BY THE ORDER OF THE COURT)
**RAMESH CHERUKU**
ADVOCATE
#11-59, Sai township, Badangpet, Kanchan Bagh, Hyderabad.
**9849078361.**

**IN THE COURT OF THE HON'BLE I ADDL FAMILY COURT, CITY CIVIL COURTS AT HYDERABAD**
**O.P.No.1157 of 2019**

**BETWEEN:**
Sathyanarayana & Another
**.... Petitioner**
**AND**
S. Mounika
**.... Respondent**

**To**
S.Mounika D/o Lalappa, Age about 34 Yrs, Occp:Labour, R/o.H.No.13-3-652/18/B, Jiyaguda, Hyderabad.

Take Notice that our Client Sri Sathyanarayana & Another has filed vide O.P.No.1157 of 2019 for custody of minor child under section 7& 25 of Guardian and wards act r/w section 7 of Family court act on the file of Hon'ble I Addl Family Court City civil court at Hyderabad and the said O.P.No. 1157 of 2019 is posted on **10-04-2023** for your appearance. Hence directed to you Respondent appear before the said court on **10-04-2023 at 10.30A.M.** either personally or through your advocate, failing which the matter will be decided on merits exparte.
(BY ORDER OF THE COURT)
**T.L.MURALI MOHAN,**
ADVOCATE
3-3-744, Kutbiguda, Hyderabad,
**(M) 9848666725**

**IN THE COURT OF HON'BLE PRINCIPALJUNIOR CIVIL JUDGE CUM IV ADDITIONAL MAGISTRATE, MEDCHAL-MALKAJGIRI DIST DISTRICT AT : L.B.NAGAR**
**O.S.No. 223 of 2023**

BETWEEN:
**Linga Lingamand others**
**...Plaintiffs**
And
**1. The Tahasildar,** Medipally Mandal
**2. All the Concerned**
**...Defendants**

The General public hereby informed that **Linga Lingam and others** have filed the suit for Declaration of Legal Heirs to declare the plaintiffs as legal heirs of Late Linga Premamma who died on 14-10-2020 The case is posted for any claims are objections on 25-04-2023 from any concern. Hence if any person is / are having any claims / objections they may appear before this Hon'ble Principal Junior Civil Judge cum IV Additional Metropolitan Magistrate, Medchal-Malkajgiri District at L.B. Nagar on 25-04-2023 at 10:30 am failing which the matter will be decided on the material available.
(By order of the Court)
**Sd/- YATA BHASKAR**
**PEEKA RAMAKRISHNA**
**PENCHALA SURENDER RAO**
**Advocates**
H.No.LIG-97, TSIIC Colony, Post: ECIL, Hyderabad -500062
**Cell No.9849613691/9912317626**

**IN THE COURT OF HON'BLE MOTOR ACCIDENT TRIBUNAL-CUM-I ADDITIONAL DISTRICT JUDDGE, RANGA REDDY DISTRICT, AT: L.B.NAGAR**
**M.V.O.P.NO.230 OF 2021**

BETWEEN:
RAMDAS KRISHNA
**... PETITIONER**
**AND**
ULLI V RAMANAIAH And others
**.. RESPONDENTS**

To
R-1 Ulli V Ramanaiah, S/o not known, Aged: Major, Occ: Insurer of the Crime Vehicle, R/o C/o A.Shiva Kumar Reddy, # 1-101, Regadi Chilkmairi Village, Kondur Mandal, Ranga Reddy District.
R-2 A.Srinivas Reddy, S/o A.Malla Reddy, Aged: Major, Occ: Regd. Owner of Vehicle, Plot No.16, Flat No.102, Sai Castle Building, Anjaiah Nagar, Moosapet, Hyderabad-18.

**NOTICE**

The Petitioner herein had filed the O.P. seeking compensation under Section 166 of the M.V.Act, 1988 and Rules 475/1B of A.P.M.V.Rules, 1989, R/w Section 163-A, 140 (c) of M.V.Act, 1988 against the Respondents which includes you. The Hon'ble Court was pleased to order for publication of this notice for your appearance in the above O.P. and the matter is posted to **08.05.2023 at 10.30 a.m.** Therefore you may appear before the Hon'ble Court either personally or through your authorized counsel or otherwise the matter will be adjudicated in due process of Law. Hence, this Notice.
[BY ORDER OF THE COURT]
**Sd/- G.RATHNAM REDDY,**
Advocate, 11-8-112, Vikas Nagar, Road No.1, Saroornagar, Ranga Reddy District.

# ప్రధాని మోడి హామీ ఇచ్చిన ఉద్యోగాలు, బ్యాంకు అకౌంట్లో డబ్బులు ఏమయ్యాయి : దేప భాస్కర్‌రెడ్డి



పోస్ట్‌కార్డు ఉద్యమం చేస్తున్న దేప భాస్కర్‌రెడ్డి తదితరులు

**ఎల్.బి.నగర్, ఏప్రిల్ 6 ప్రభాతవార్త** : ఎన్నికలలో యువతకు ఉద్యోగాలు, బ్యాంకు అకౌంట్లో రూ.15లక్షలు వేస్తామని ప్రధాని మోడీ ఇచ్చిన హామీ ఎందుకు నెరవేర్చ లేదని టిపిసిసి సభ్యుడు దేప భాస్కర్‌రెడ్డి ప్రశ్నించారు. ఆర్కేపురం, సరూర్‌నగర్ డివిజన్‌లలో పున్న గణేష్‌నేత, మహమ్మద్ గుల్షన్ ఆధ్వర్యంలో ఎన్నికల హామీ నెరవేర్చ దానికి డిమాండ్ చేస్తూ ప్రధాని మోడీకి ఉత్తరాలు రాసి పోస్ట్‌కార్డ్ ఉద్యమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా భాస్కర్ రెడ్డి మాట్లాడుతూ 2014 ఎన్నికలలో ప్రధాని మోడీ మా బ్యాంకు ఖాతాల్లోకి రూ.15లక్షలు వేస్తామని వాగ్దానం చేసిన డబ్బును ఎప్పుడు వేస్తారో సమాధా నం చెప్పలన్నా రు. సంవత్సరానికి 2కోట్ల ఉద్యోగాలు ఏమయ్యాయని ప్రశ్నించారు. మోడీ ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తున్న రాహుల్ గాంధీని కుట్రపూరితంగా కేసు లో ఇరికించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కుట్రలో భాగంగానే రాహుల్‌గాంధీ ఎంపీ పదవిపై అనర్హత వేటు వేయడం బిజెపి కుట్రపూరిత చర్య అన్నారు. కార్యక్రమంలో బండి మధుసూదన్‌రావు రాష్ట్ర యువజన నాయకులు చిలక ఉపేందర్‌రెడ్డి, గట్ల రవీంద్ర, నల్లెంకి ధనరాజ్‌గౌడ, బొడ్డుపల్లి మహేందర్, తలటి రమేష్‌నేత, ఎన్ఎస్‌యుఐ శివ, శ్రీకాంత్‌రెడ్డి, నగేష్, విప్లవ్‌రెడ్డి, జహంగీర్ అనుదీప్, శివ పాల్గొన్నారు.

# ఘనంగా బిజెపి ఆవిర్భావ దినోత్సవ వేడుకలు



పార్టీ పతాకాన్ని ఎగురవేస్తున్న పెండ్యాల నర్సింహ

**సరూర్‌నగర్, ఏప్రిల్ 6 ప్రభాతవార్త:** మహేశ్వరం నియోజకవర్గంలోని మీర్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్‌లో గురువారం బిజెపి 43వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా మీర్‌పేట్ చౌరస్తాలో కార్పొరేషన్ బిజెపి అధ్యక్షుడు పెండ్యాల నర్సింహ, 27వ డివిజన్ కార్పొరేటర్ పసునూరి బిక్షపతి కార్యాలయం వద్ద పార్టీ ఆవిర్భావ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా బిజెపి జెండాను ఎగురవేశారు. ఈ కార్యక్రమాల్లో రాష్ట్ర బిజెపి కార్యవర్గ సభ్యుడు అందెల శ్రీరాములు యాదవ్, కీసర గోవర్ధన్‌రెడ్డి, పసునూరి బిక్షపతిచారి, భీమ్‌రాజ్, కీసర జమునాకృష్ణారెడ్డి, బచ్చనమోని నర్సింహయాదవ్, సూల ప్రభాకర్, యాదగిరియాదవ్, బెల్లంకొండ చీలంపల్లి రాజశేఖర్, నాగరాజు, నాగేష్ తదితరులు పాల్గొన్నారు.

**జక్కిడి మంజులా జంగారెడ్డి ఆధ్వర్యంలో..** బడంగ్‌పేట్ కార్పొరేషన్‌లోని 26వ డివిజన్ అల్మాస్‌గూడ తిరుమల నగర్‌లో బిజెపి కార్యాలయం వద్ద డివిజన్ పార్టీ ఇంఛార్జి జక్కిడి మంజుల జంగారెడ్డి ఆధ్వర్యంలో పార్టీ ఆవిర్భావ వేడుకలను ఘనంగా జరిపారు. ఈ సందర్భంగా పార్టీ పతకాన్ని ఎగురవేశారు. కార్యక్రమంలో జక్కిడి జంగారెడ్డి, శివరాంరెడ్డి, వనం శ్రీనివాసులు, శివానందరెడ్డి, పవన్ కుమార్, రాముగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# నిజాయితీ, సమర్ధ పాలన బీజేపీతోనే సాధ్యం : నవజీవన్‌రెడ్డి



ఆవిర్భావ వేడుకల్లో కార్పొరేటర్, నాయకులు

**హయత్‌నగర్, ఏప్రిల్ 6 ప్రభాతవార్త:** శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీ వేసిన పునాదులపై నిర్మితమై... దీన్‌దయాల్ ఉపాధ్యాయ ప్రవచించిన ఏకాత్మ మానవతా వాదానికి కట్టుబడి అటల్, అద్వాని అగ్రనేతల మార్గదర్శకత్వంలో అమిత్‌షా, నరేంద్రమోడి నేతృత్వంలో బీజేపీ ప్రపంచం లో అతిపెద్ద పార్టీగా అవతరించిందని హయత్‌నగర్ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్‌రెడ్డి అన్నారు. బీజేపీ ఆవిర్భా వ దినోత్సవాన్ని పురస్కరించుకుని డివిజన్ పరిధిలోని ఆయా కాలనీల్లో ఆయన పార్టీ జెండాను ఆవిష్కరించి మిఠాయిలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రపంచదేశాలుప్రస్తుతం భారత్‌వైపు చూస్తు న్నాయన్నారు. కరోనా కాలంలో అగ్ర దేశాలతో పాటు అన్ని దేశాల ఆర్థిక వ్యవస్థలు చితికిపోయి వనరులు లేక ఇబ్బందులు పడ్డాయని కానీ నరేంద్రమోడి తీసుకు న్న నిర్ణయాలు భారత దేశాన్ని కష్టకాలంలో గర్వంగా నిలబెట్టాయన్నారు. నిజాయతీ, సమర్థత కలిగిన నాయకులు పాలకులుగా ఉండడం దేశానికి అవ సరమని ప్రస్తుత కేంద్ర ప్రభుత్వం నిరూపిస్తోందన్నారు. పార్టీ అభివృద్ధిలో భాగస్వాములైన నాయకులు, కార్యకర్తలకు ఆయన శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో బండారి భాస్కర్ పాల్గొన్నారు.

# కొత్తపేట డివిజన్‌లో బిజెపి ఆవిర్భావ దినోత్సవ వేడుకలు



కార్యక్రమంలో మాట్లాడుతున్న పవన్‌కుమార్

**ఎల్బీనగర్, ఏప్రిల్ 6 ప్రభాతవార్త:** బిజెపి ఆవిర్భావ దినో త్సవం సందర్భంగా కొత్తపేట డివిజన్ బిజెపి ఆధ్వర్యం లో మోహన్‌నగర్‌చౌరస్తా, న్యూనాగోల్ కాలనీలలో కార్పొ రేటర్ నాయికోటి పవన్‌కుమార్ పార్టీ జెండాను ఆవిష్కరిం చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేవలం 2 సీట్లతో ప్రారంభమైన బిజెపి ప్రయాణం నేడు 300సీట్లతో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసి ప్రధాన మంత్రి నరేంద్రమోడీ సారధ్యంలో దేశాన్ని అభివృద్ధి పథంలో ముందుకు తీసు కువెళ్తున్నాడని పేర్కొన్నారు.తెలంగాణ ప్రభుత్వ అవినీతి, అక్రమాలను బయట పెడుతున్న బిజెపి రాష్ట్ర అధ్యక్షులు బండి సంజయ్‌కుమార్‌ని ప్రభుత్వం కుట్రపూరితంగా అరె స్టు చేసిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో డివిజన్ బిజెపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

**సరూర్‌నగర్‌లో...** ప్రధానమంత్రి మోడీ నాయకత్వంలో దేశం అన్ని రంగాలలో అభ్యున్నతి సాధిస్తుందని సరూర్ నగర్ డివిజన్ కార్పొరేటర్ ఆకుల శ్రీవాణి అంజన్‌కుమార్ పేర్కొన్నారు. బిజెపి ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా సరూర్‌నగర్‌లో బిజెపి జెండాను కార్పొరేటర్ ఆవిష్కరించి వేడుకలు నిర్వ హించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కేవలం రెండు పార్లమెంటు సీట్లతో ఉన్న బిజెపి నేడు సొంతంగా 300కు పైగా సీట్లతో దేశంలో అధికా రాన్ని చేపట్టడం బిజెపి అంకితభావానికి నిదర్శనం అన్నారు.

# ఘనంగా హనుమజ్జయంతి - కనుల పండువగా శోభాయాత్ర



పూజలు నిర్వహిస్తున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి



దేవతలగుట్టపై పూజలు చేస్తున్న పారిజాత నర్సింహారెడ్డి



హనుమాన్ శోభాయాత్రలో పాల్గొన్న అందెల శ్రీరాములు



శోభాయాత్రలో పాల్గొన్న కార్పొరేటర్ లచ్చిరెడ్డి తదితరులు



పూజలు నిర్వహిస్తున్న ముద్దగౌని లక్ష్మీప్రసన్న తదితరులు



భక్తులకు ప్రసాదాన్ని అందజేస్తున్న ఉప్పల శ్రీనివాస్‌గుప్తా



మారుతి మందిర్‌లో పూజలు నిర్వహిస్తున్న ఇఓ సత్యనారాయణ



మలక్‌పేటలో ర్యాలీ నిర్వహిస్తున్న సుదర్శన్, కృష్ణ తదితరులు



పూజలు నిర్వహిస్తున్న నల్ల రఘుమారెడ్డి దంపతులు

**సైదాబాద్, ఏప్రిల్ 6 ప్రభాతవార్త:** హనుమజ్జయంతి సందర్భంగా ఉదయం నుంచే కర్మన్‌ఘాట్ హనుమాన్ దేవాలయం భక్తులతో కిటకిటలాడింది. స్వామి వారికి ఉదయం ప్రత్యేక సింధూరాభి షేకము, అలంకరణ గావించారు. దేవాలయాన్ని మొత్తం పూలు, విద్యుత్ దీపాలతో అందంగా అలంకరించారు. ఎండాకాలన్ని దృష్టిలో పెట్టుకుని చలువ పందిళ్లు ఏర్పాటు చేశారు. త్రాగునీరు, చల్లని మజ్జిగ, పులిహోర ప్రసాద పంపిణీ నిర్వహించారు. భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా అన్ని ఏర్పాట్లు చేసినట్లు ఆలయ కార్యనిర్వాణాధికారి ఎం.శ్రీనివాస శర్మ, ఆలయకమిటీ చైర్మన్ పోచబోయిన ఈశ్వరమ్మ యాదవ్‌లు తెలిపారు. ఎల్‌బినగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డితో పాటు పలువురు ప్రముఖులు దేవాలయానికి వచ్చి స్వామి వారికి పూజలు నిర్వహించారు.

**కన్నుల పండువగా సాగిన శోభాయాత్ర...** హనుమాన్ జయంతిని పురస్కరించుకుని కర్మన్‌ఘాట్ హనుమాన్ దేవాలయం నుంచి తాడ్‌బన్ ఆంజనేయ స్వామి దేవాలయానికి శోభాయాత్రగా పెద్ద ఎత్తున భక్తులు తరలివెళ్లారు. ఎల్‌బినగర్, మహేశ్వర ం, యాకుత్‌పుర, చాంద్రాయణ గుట్ట నియోజకవర్గాల నుంచి పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చి శోభాయాత్రలో పాల్గొన్నారు.

**వనస్థలిపురం, ప్రభాతవార్త:** హనుమాన్ జయంతి సందర్భంగా బిఎన్‌రెడ్డినగర్ డివిజన్ కార్పొరే టర్ మొద్దు లచ్చిరెడ్డి ఆధ్వర్యంలో డివిజన్ పరిధిలోని ఎస్‌కెడినగర్, డిపిఎస్ స్కూల్‌నుండి కర్మన్‌ఘాట్ హనుమాన్ దేవాలయంవరకు శోభాయాత్ర బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్ర మంలో రాజేశ్వరి శక్తిపీటం నవీన్‌శర్మ, నాయకులు సామ రంగారెడ్డి, వనిపల్లి శ్రీనివాసరెడ్డి, కొంతం నవకిషోర్‌రెడ్డి, సంక్షేమ సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు. హనుమాన్ జయంతిని పురస్కరించుకుని బిఎన్‌రెడ్డినగర్ డివిజన్ మాజీ కార్పొరేటర్ ముద్దగౌని లక్ష్మీప్రసన్న రామ్మోహన్‌గౌడ్ సాహెబ్‌నగర్‌లోని శ్రీ త్రినేత్రాంజనేయస్వామి ఆలయంలో జరిగిన ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో పాల్గొని పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ డైరెక్టర్ ఉమేష్‌గౌడ్, నీల్ల భవానీగౌడ్, సరస్వతి తదితరులు పాల్గొన్నారు.

**మలక్‌పేట, ప్రభాతవార్త:** దిల్‌సుక్‌నగర్ మారుతి మందిర్‌లో హనుమాన్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో ఇఓ వివిఎస్‌వి సత్యనారాయణ, నిర్వాహకులు గోవర్ధన్, అర్చకులు ప్రహ్లాద్‌శర్మ, అశోక్ జోషి, బుజ్జి నాయుడు తదితరులు పాల్గొన్నారు. సలీంనగర్‌లోని గణపతి ఆలయంలో హనుమాన్ జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ రమేష్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఓల్డ్ మలక్‌పేటలోని దాసాంజ నేయస్వామి దేవాలయంలో ఆలయ చైర్మన్ బాబు సుదర్శన్ ఆధ్వర్యంలో హనుమాన్ జయంతి వేడుకలు ఘనంగా జరిగా యి. మాజీ చైర్మన్ దేవిప్రసాద్, నాయకులు దాసోజు శ్రవణ్‌కుమార్ తదితరులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అమర్‌నాథ్‌గౌడ్, బాబురాజు, చుక్క కృష్ణ తదితరులు పాల్గొ న్నారు. మూసారాంబాగ్ బాలదానమ్మబస్తీలో వీరహనుమాన్ శోభాయాత్రలో డివిజన్ కార్పొరే టర్ బొక్క భాగ్యలక్ష్మి నాయకులు కార్యకర్తలతో కలిసి పాల్గొని ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో లింగాల హరిగౌడ్, సందడి సురేందర్‌రెడ్డి, బొక్క మధుసూదన్‌రెడ్డి, రమేష్‌రెడ్డి, కొప్పుల దినేష్, మందడి సందీప్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఓల్డ్ మలక్‌పేటలో హనుమాన్ జయంతి సందర్భంగా హనుమాన్ శోభాయాత్రను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ పిసిసి ప్రధాన కార్యదర్శి బొల్లు కిషన్ గ్రేటర్ ఉపాధ్యక్షులు బాబు శ్రీనివాస్, చౌకి రవికుమార్, కొమిరెల్లి రాజశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. మలక్‌పేట పల్టాన్‌లోని హరిహర క్షేత్రంలో హనుమాన్ జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. కార్య క్రమంలో ట్రస్టీ సూగూరు రమేష్, ఇఓ జోషిమార్తాండరావు, అర్చకులు మంగళగిరి శ్రీనివాసాచార్యులు, కాసుల చంద్రశేఖర శర్మ, సభ్యులు రమేష్, శ్రీహరి, విజయ్‌కుమార్, సత్యేందర్ తదితరులు పాల్గొన్నారు.

**మల్కాజిగిరి, ప్రభాతవార్త:** ఈస్ట్ ఆనంద్ భాగ్ డివిజన్ తాళ్లబస్తి లోని హనుమాన్ దేవాలయంలో హనుమాన్ జయంతి సందర్భంగా కార్పొరేటర్ ప్రేమ్‌కుమార్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో బాబు, సత్యనారాయణ, సంపత్ రావు, పద్మారావు, ఓంరాజ్, ఎల్లేష్, రాజేష్, కిషోర్ తదితరులు పాల్గొన్నారు. గౌతమ్‌నగర్ డివిజన్ సంజయ్‌నగర్‌లో హనుమాన్ జయంతి సందర్భంగా కరుణాకర్‌స్వామి ఆధ్వర్యంలో కార్పొరేటర్ మేకల సునీత రామూయాదవ్ ప్రత్యేక పూజలు చేసారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో నాయకులు మేకల రామూయాదవ్, ఇతర నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

**ఎల్.బి.నగర్ ప్రభాతవార్త :** హనుమాన్ జయంతి సందర్భంగా ఆర్కేపురంలో శ్రీప్రసన్నాంజనేయ స్వామివారి దేవాలయంలో రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ మాజీ చైర్మన్ ఉప్పల శ్రీనివాస్‌గుప్త దంపతులు స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా దేవాలయం నిర్వాహకులు ఉప్పల శ్రీనివాస్‌ను శాలువాతో సత్కరించారు. అనంతరం ఉప్పల శ్రీనివాస్ భక్తులకు ప్రసాదాన్ని పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఉప్పల స్వప్న, ఉప్పల సాయికిరణ్, సాయితేజ, చైర్మన్ రాజు, డైరెక్టర్స్ దేవాలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

**సరూర్‌నగర్, ప్రభాతవార్త:** మహేశ్వరం నియోజకవర్గం బాలాపూర్‌లో హనుమాన్ జయంతి ఘనంగా వేడుకలు జరిగాయి. ఈ సందర్భంగా బడంగ్‌పేట్, మీర్‌పేట్, జల్‌పల్లి మున్సిపాలిటీ ల్లో హనుమాన్ దేవాలయాలు భక్తుల రాకతో కళకళలాడాయి. హనుమాన్ జయంతి సందర్భంగా టిపిసిసి కార్యదర్శి యెల్మేటి అమరేందర్‌రెడ్డి బాలాపూర్‌లోని ఆంజనేయ స్వామి, బాలాపూర్ దేవతలగుట్టపైనున్న అభయాంజనేయస్వామి, పెద్దచెరువు బాలాంజనేయస్వామి ఆలయాలను సందర్శించి పూజలు చేశారు. ఈ కార్యక్రమాల్లో వంగేటి మధుసూదన్‌రెడ్డి, కళ్లెం నిరంజన్‌రెడ్డి, సంరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, గోవర్ధన్‌రెడ్డి, ఆంజనేయులు, రామస్వామి తదితరులు పాల్గొన్నారు.

**ఆలయాల్లో మేయర్ పారిజాత ప్రత్యేక పూజలు...** బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ మేయర్, టిపిసిసి ప్రధాన కార్యదర్శి చిగిరింత పారిజాత నర్సింహారెడ్డి బాలాపూర్ దేవతలగుట్ట ఆభయాం జనేయస్వామి, బాలాపూర్ బాలాంజనేయస్వామి ఆలయాల్లో హనుమాన్ జయంతిని పురస్కరిం చుకొని ప్రత్యేక అభిషేకాలు చేశారు. అదేవిధంగా సాయిబాలాజీ కాలనీలో నిర్వహించిన హనుమ జ్జయంతి వేడుకలకు హాజరయ్యారు. ఈ కార్యక్రమాల్లో కాంగ్రెస్ ఫ్లోర్ లీడర్ వంగేటి ప్రభాకర్ రెడ్డి, కార్పొరేటర్లు పెద్దబావి సుదర్శన్‌రెడ్డి, నేనావత్ బాలు నాయక్, బండారి మనోహర్, నాయకులు రాళ్ళగూడెం శ్రీనివాస్‌రెడ్డి, మహిళా నాయకురాళ్లు పెద్దబావి మౌనిక సుదర్శన్‌రెడ్డి, తూళ్ళ సునీతగౌడ్, స్థానిక కాలనీవాసులు, ఆలయాల కమిటీల వారు పాల్గొన్నారు.

**హనుమాన్ శోభాయాత్రలో అందెల శ్రీరాములు...** హనుమాన్ జయంతి సందర్భంగా మహేశ్వ రం నియోజకవర్గ బిజెపి ఇంఛార్జి అందెల శ్రీరాములు యాదవ్ వివిధ ప్రాంతాల్లోని హనుమాన్ ఆలయాల్లో పూజలు నిర్వహించి మామిడిపల్లిలో పంచముఖి హనుమాన్ వ్యాయామశాల కమిటీ ఆధ్వర యంలో జరిగిన హనుమాన్ శోభాయాత్రకు హాజరయ్యారు. శోభాయాత్రలో మద్ది రాజశేఖర్‌రెడ్డి, లిక్కి విజేందర్‌రెడ్డి, పేరమోని నరేష్ యాదవ్, విఘ్నేశ్, రంగనాథ్, విశ్వనాథ్, శ్రీకాంత్, జగన్నాథ్‌రెడ్డి, వెంకట్, మురళిలతో పాటు పలువురు పాల్గొన్నారు.

**జిల్లెలగూడలో హనుమాన్ శోభాయాత్ర...** హనుమాన్ జయంతి సందర్భంగా మీర్‌పేట్ కార్పొరేషన్ జిల్లెలగూడ కమలానగర్ నుండి కర్మన్‌ఘాట్ హనుమాన్ దేవాలయం వరకు హనుమాన్ శోభాయాత్రను అట్టహాసంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ ఫ్లోర్ లీడర్ అర్కల భూపాల్‌రెడ్డి, జిల్లెలగూడ వెంకటేశ్వర స్వామి టెంపుల్ మాజీ డైరెక్టర్ మాదరి రమేష్, బచ్చనమోని రమేష్ యాదవ్, బొజ్జ రాజు, లక్ష్మణ్, శివ, దేవి ముదిరాజ్‌లతోపాటు యంగ్ స్టార్ హనుమాన్ యూత్ అసోసియేషన్ యువకులు పాల్గొన్నారు.

# ఆన్‌లైన్ బెట్టింగ్ వ్యసనంతో మనస్థాపానికి గురై ఉద్యోగి ఆత్మహత్య

**కుషాయిగూడ, ఏప్రిల్ 6 ప్రభాతవార్త :** ఆన్‌లైన్ బెట్టింగ్ వ్యసనానికి లోనై తీవ్ర మనస్థాపానికి గురైన ఎన్ఎఫ్‌సి ఉద్యోగి ఆత్మహత్యకు పాల్పడిన సంఘ టన కుషాయిగూడ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలి పిన వివరాల ప్రకారం ఎన్ఎఫ్‌సి కంపెనీలో ఉద్యోగం చేస్తూ డిఎఈ కాలనీ లో నివాసముండే వరద శివ (31) గత కొంతకాలంగా ఆన్‌లైన్ బెట్టింగ్ వ్యసనానికి గురై ఆర్థిక బాధలు తాళలేక మానసిక వేదనకు గురవుతున్నాడు. కాగా భార్య ప్రభాత, కుమారుడు వరద వేదాంశంతో కలిసి గద్వాల్‌లోని అత్తగారింటికి వెళ్లి భార్య, కుమారుడిని వదిలి తిరిగి డిఏఇ కాలనీకి వచ్చాడు. ఆన్‌లైన్ బెట్టింగ్ వ్యసనాల కారణంగా అప్పుల పాలై మానసిక వేదనకు గురై ఇంట్లో ఎవరూ లేని సమయంలో బుధవారం రాత్రి ఫ్యానుకు ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. బెట్టింగ్ వ్యసనాన్ని మానుకోలేక భార్యా పిల్లలను సక్రమంగా పోషించలేని స్థితికి చేరుకుని గత్యంతరం లేక ఆత్మహత్యకు పాల్పడుతున్నానని రాసి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. సెక్యూరిటీ గార్డు ద్వారా సమాచారం అందుకున్న భార్య ప్రభాత ఇంటికి చేరుకొని పోలీసులకు సమా చారం అందించడంతో పోలీసులు మృతదేహాన్ని స్వాధీనం చేసుకొని ఆసుపత్రి కి తరలించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

# తుర్కయాంజాల్ మున్సిపాలిటీలో ఘనంగా బిజెపి ఆవిర్భావ దినోత్సవం



బిజెపి జెండాను ఆవిష్కరించిన పురుషోత్తం తదితరులు

**తుర్కయంజాల్, ఏప్రిల్ 6 ప్రభాతవార్త:** తుర్కయంజాల్ మున్సిపాలిటీ ఇంజాపూర్ స్నేహపురి కాలనీలో బిజెపి రాష్ట్ర ఎస్సీ మోర్చా సోషల్ మీడియా కన్వీనర్ కొండ్రు పురుషోత్తం ఆధ్వర్యంలో బిజెపి ఆవిర్భావ దినోత్సవాన్ని నిర్వహించి జెండా ఎగరవేసారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రానున్న రోజుల్లో ప్రజలందరిని భాగస్వామ్యం చేస్తూ పార్టీని బలోపేతం చేస్తామని అన్నారు ఈ కార్యక్రమంలో ఈ కార్యక్రమంలో ఎస్టి మోర్చా జిల్లా అధ్యక్షులు ధరావత్ శ్రీనివాస్ నాయక్, బీజేవైఎం జిల్లా కార్యదర్శి మల్లెల దేవేందర్, బిజెపి నాయకులు బత్తిని సుమన్‌గౌడ్, కుక్కల శివప్రసాద్‌రెడ్డి, మధుసూదన్‌రెడ్డి, బిట్టు తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణాలో బిజెపి జెండాను ఎగురవేస్తాం : నల్లు ఇంద్రసేనారెడ్డి



బిజెపి జెండాను ఆవిష్కరిస్తున్న ఇంద్రసేనారెడ్డి తదితరులు

**మలక్‌పేట, ఏప్రిల్ 6 ప్రభాతవార్త:** రానున్న ఎన్నికలలో తెలంగాణాలో విజ యం సాధించి బిజెపి జెండాను ఎగురవేస్తామని బిజెపి జాతీయ నాయకులు నల్లు ఇంద్రసేనారెడ్డి పేర్కొన్నారు. సలీంనగర్‌లోని బిజెపి భాగ్యనగర్ జిల్లా పార్టీ కార్యాలయంలో జరిగిన బిజెపి ఆవిర్భావ దినోత్సవానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై బిజెపి జెండాను ఎగురవేసారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్నర్ మీటింగ్ ద్వారా స్థానిక నాయకత్వం బాగా పెరిగింద న్నారు. కేంద్రప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాల గురించి నాయకులు, కార్యకర్తలు ప్రజలకు వివరించి పార్టీని పటిష్టం చేయాలన్నారు. ఈ కార్యక్ర మంలో భాగ్యనగర్ జిల్లా అధ్యక్షుడు సంరెడ్డి సురేందర్‌రెడ్డి, కార్పొరేటర్లు బొక్క భాగ్యలక్ష్మి, కొత్తకాపు అరుణసురేందర్‌రెడ్డి, నాయకులు సందడి సురేందర్‌రెడ్డి, గౌర దేవేందర్, సుభాష్‌చందర్‌జీ, రమేష్‌రెడ్డి, యాదగిరిరెడ్డి, కొప్పుల దినేష్, లింగాల హరిగౌడ్, గజానంద్ తదితరులు పాల్గొన్నారు.

# అవినీతి, అక్రమాలపై ప్రశ్నిస్తే జైలుకు పంపుతారా... : శ్యామ్‌చరణ్‌రెడ్డి

**హయత్‌నగర్, ఏప్రిల్ 6 ప్రభాతవార్త:** 10వ తరగతి పరీక్షా ప్రశ్నపత్రం లీకేజీపై పోరాటం చేసిన ఎల్.బి.నగర్ యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు గుర్రం శ్యామ్‌చరణ్‌రెడ్డిని పోలీసులు అరెస్టు చేయగా... ఆయన గురువారం విడుద లయ్యాడు. ఆయనకు యూత్‌కాంగ్రెస్, ఎన్ఎస్‌యూఐ నాయకులు ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన హయత్‌నగర్‌లో విలేకరులతో మాట్లాడుతూ విద్యార్థుల భవిష్యత్తుతో ప్రభుత్వం ఆటలాడుకుంటోందన్నారు. వరుసగా పరీక్షా పత్రాలు లీకవుతున్నా వాటిని నివారించడంలో ప్రభుత్వం విఫలమవుతోందన్నారు. టీఎస్‌పీఎస్‌సీ పేపరు మొదలుకుని 10వ తరగతికి సంబంధించి రెండు పరీక్షా పత్రాలు లీకవడంతో విద్యార్థులు, వారి తల్లిదం డ్రులలో ఆందోళన నెలకొందన్నారు. వెంటనే దిద్దుబాటు చర్యలు తీసుకోకుం డా అక్రమాలపై ప్రశ్నించిన వారిపై కేసులు బనాయించి జైలుకు పంపడం సిగ్గుచేటన్నారు. అధికార మదంతో ప్రతిపక్షాలపై అక్రమ కేసులు బనాయిస్తు న్న బీఆర్ఎస్ ప్రభుత్వానికి రోజులు దగ్గరపడ్డాయన్నారు.

# అన్ని దానాల్లో కన్నా అన్నదానం మిన్న : చేవూరి అరుణ



అన్నప్రసాదం వడ్డిస్తున్న చేవూరి అరుణ, సుదర్శన్

**నాచారం, ఏప్రిల్ 6 ప్రభాతవార్త:** ఓల్డ్ మల్లాపూర్‌లోని శ్రీసీతారామాంజనేయ దేవలయంలో ఘనంగా హనుమాన్ జయంతి వేడుకలను జరుపుకున్నారు. ఈ సందర్భంగా పూజా కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా చేవూరిఉషశ్రీ ఆధ్వర్యంలో భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా చేవూరి అరుణ, సుదర్శన్ మాట్లాడుతూ తాము శ్రీరామ నవమి, హనుమాన్ జయంతి, దసరా ఉత్సవాల సందర్భంగా అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో బంగార్ రాజు, చేవూరి ఉషశ్రీ, పెద్దపాటి అర్జున్, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

**వేడుకల్లో పాల్గొన్న డిప్యూటీ మేయర్...** హనుమాన్ జయంతి వేడుకల సంద ర్భంగా డివిజన్‌లోని పలు ఆలయాలవద్ద ఏర్పాటు చేసిన జయంతి వేడుకల్లో నగర డిప్యూటీ మేయర్ శ్రీలత శోభన్‌రెడ్డి బీఆర్ఎస్ కార్మిక విభాగం రాష్ట్ర అధ్యక్షులు శోభన్‌రెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భక్తులకు అన్న ప్రసాదం వడ్డించారు. లాలాపేట్‌లోని వీర హనుమాన్ వ్యాయామశాల ఆధ్వర్యంలో వారు పాల్గొన్నారు.



బిఆర్ఎస్ ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమంలో తెలంగాణ ఉద్యమ నేత బోదాసు రవిని సన్మానిస్తున్న ఎమ్మెల్యే బేతి సుభాష్‌రెడ్డి, ఎంబీసీ మాజీ చైర్మన్ తాడూరి, కార్పొరేటర్ ప్రబుదాస్, మాజీ కార్పొరేటర్ శ్రీనివాస్‌రెడ్డి (ప్రభాతవార్త, కుషాయిగూడ)



జిల్లెలగూడలో హనుమాన్ జయంతి ఉత్సవాల్లో పాల్గొన్న కళాకారులు



శోభాయాత్రను నిర్వహిస్తున్న కార్పొరేటర్ భాగ్యలక్ష్మి తదితరులు



పూజలు నిర్వహిస్తున్న కృష్ణారెడ్డి తదితరులు

# ఐఎస్ సదన్ డివిజన్‌లో ఘనంగా బిజెపి ఆవిర్భావ దినోత్సవ వేడుకలు



బిజెపి జండాను ఎగురవేస్తున్న కార్పొరేటర్ శ్వేత మధుకర్‌రెడ్డి తదితరులు

**సైదాబాద్, ఏప్రిల్ 6 ప్రభాతవార్త:** బిజెపి ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరిం చుకుని గురువారం ఐఎస్ సదన్ డివిజన్‌లోని పలు ప్రాంతాల్లో కార్పొరేటర్ జంగం శ్వేత మధుకర్‌రెడ్డి బిజెపి జండాను ఎగురవేశారు. ఈ కార్యక్రమంలో మన్నె శ్రీనివాస్, వీరేంద్రబాబు, అమర్నాథ్‌రెడ్డి, రాజేందర్ రెడ్డి, గిరిధర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.